# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | బుధవారం-03-సెప్టెంబర్-2025 | సంపుటి : 3 | సంచిక : 97 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## రూ.186 కోట్ల వ్యయంతో మెడికల్, నర్సింగ్ కాలేజీలు నిర్మాణం ప్రారంభం

- 186 కోట్లతో మెడికల్, నర్సింగ్ కాలేజీల ప్రారంభం
- మహబూబాబాద్‌లో క్రిటికల్ కేర్ బ్లాక్, హాస్టల్స్ అందుబాటులోకి
- మంత్రులు విద్యార్థులతో అనుభవాలు పంచుకున్న సందర్భం
- విద్య, వైద్య రంగాల అభివృద్ధికి పకడ్బందీ ప్రణాళికలు
- జిల్లాకు 18 టన్నుల యూరియా – మరింత కోటా కోసం ప్రయత్నాలు
- వైద్య ఆరోగ్యశాఖ బలోపేతానికి మౌలిక వసతులు, పదోన్నతులు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

మహబూబాబాద్ పట్టణ కేంద్రంలో మంగళవారం సుమారు 186 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించబడిన మెడికల్, నర్సింగ్ కాలేజీలతో పాటు 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్, బాలురబాలికల హాస్టల్ ప్రారంభమయ్యాయి.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళినాయక్, పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మిగతా 2లో





## వ్యవసాయం దండగ కాదు పండగ చేయాలని వైఎస్ఆర్ సంకల్పించారు

- యువ, కొత్త ఎమ్మెల్యేలను ప్రోత్సహించడంలో వైఎస్ఆర్ ఎప్పుడూ ముందుండేవారన్న సీఎం రేవంత్
- ఫ్లోరైడ్ వల్ల జీవించలేని పరిస్థితులు ఉన్న నల్గొండ జిల్లాను మార్చాలని వైఎస్ఆర్ భావించారని వెల్లడి
- సీఎం రేవంత్ రెడ్డి

2లో



## రేవంత్ రెడ్డికి వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు

- 2021 నాటి రాజ్‌భవన్ ముట్టడి కేసులో కీలక పరిణామం
- కేసు కొట్టివేయాలంటూ హైకోర్టును ఆశ్రయించిన రేవంత్
- తదుపరి విచారణ అక్టోబర్ 7వ తేదీకి వాయిదా

2లో



## మొన్న కాళేశ్వరం కూలింది, నిన్న బీఆర్ఎస్ కూలింది

- కాళేశ్వరం మూడు పిల్లర్లు కూలిపోతే, బీఆర్ఎస్ మూడు ముక్కలు అయ్యింది
- అవినీతి పరులకు బీజేపీలో చోటులేదు
- బీజేపీ ఎంపీ లక్ష్మణ్



ఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు):

మొన్న కాళేశ్వరం కూలింది, నిన్న బీఆరెస్ కూలిందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. కాళేశ్వరం మూడు పిల్లర్లు కూలిపోతే, బీఆర్ఎస్ మూడు ముక్కలు అయ్యిందని ఎద్దేవా చేశారు. అవినీతి పరులకు బీజేపీలో చోటులేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు..

2లో

## బీఆర్ఎస్ నుంచి కవిత సస్పెన్షన్

- జూబ్లీహిల్స్ జాగృతి కార్యాలయం వద్ద ఉద్రిక్తత
- హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి, సంతోష్ రావుకు వ్యతిరేకంగా ప్లకార్డులు
- కవిత ఏ నిర్ణయం తీసుకున్నా వెంటే ఉంటామన్న జాగృతి నేతలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీ కవితను సస్పెండ్ చేయడం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. పార్టీ నుంచి ఆమెను సస్పెండ్ చేస్తున్నట్టు అధికారిక ప్రకటన వెలువడిన వెంటనే, ఆమె మద్దతుదారులు, జాగృతి కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసనలకు దిగారు. జూబ్లీహిల్స్‌లోని జాగృతి ప్రధాన కార్యాలయానికి భారీ సంఖ్యలో చేరుకున్న కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. 'జై కవితక్క.. జై జాగృతి' అంటూ నినాదాలతో హోరెత్తించారు.

మిగతా 2లో





## కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే ప్రసక్తే లేదు

- ఆమె సస్పెన్షన్ బీఆర్ఎస్ అంతర్గత వ్యవహారమని వ్యాఖ్య
- అవినీతి సొమ్ము పంపకాలలో తేడాతోనే కవిత వ్యాఖ్యలు చేశారన్న టీపీసీసీ చీఫ్
- పదేళ్ల బీఆర్ఎస్ పాలన అవినీతిని ఆమె బయటపెట్టాలని డిమాండ్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ఎమ్మెల్సీ కవితను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడంపై తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే ప్రసక్తే లేదని, ఆమె అవసరం తమ పార్టీకి ఏమాత్రం లేదని తేల్చి చెప్పారు. కవితను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడం పూర్తిగా ఆ పార్టీ అంతర్గత వ్యవహారమని, దానితో తమకు సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు.

మిగతా 2లో


## మూడురోజులు భారీ వర్షాలు..

### హెచ్చరించిన ఐఎండీ

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణలో మరో మూడురోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతుందని.. రాబోయే 24గంటల్లో మరింత బలపడే అవకాశాలున్నాయని తెలిపింది. ఆ తర్వాత ఒడిశా మీదుగా పశ్చిమ వాయువ్య దిశగా కదిలే అవకాశాలున్నాయని పేర్కొంది. మంగళవారం ఆదిలాబాద్, కొత్తగూడెం, హన్మకొండ, జనగాం, జయశంకర్, భూపాలపల్లి, కామారెడ్డి, ఖమ్మం,


మిగతా 2లో



## ఆన్‌లైన్ బెట్టింగ్ గ్యాంగ్ అరెస్ట్

- హైదరాబాద్‌లో మరో ఆన్‌లైన్ బెట్టింగ్ గ్యాంగ్ బహిర్గతం
- నిషేధిత ఖేలో యాప్‌లతో ఎనిమిది మంది అరెస్ట్
- మారు పేర్లతో యూజర్ ఐడీలు, బ్యాంక్ ఖాతాలు సృష్టింపు
- పరారీలో ఉన్న కీలక నిందితులు రాజేష్, అస్లాం
- 235 యూజర్ ఐడీలు, యువతను ఆకర్షించిన ముఠా
- టాస్క్ ఫోర్స్, ఎస్.ఆర్.నగర్ పోలీసుల సంయుక్త దాడి
- 18 మొబైల్‌లు, 13 ఏటీఎం కార్డులు స్వాధీనం

2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : హొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## వ్యవసాయం దండగ కాదు పండగ చేయాలని

# వైఎస్ఆర్ సంకల్పించారు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



వ్యవసాయం దండగ కాదు పండగ చేయాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ఆర్ సంకల్పించారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని హోటల్ దసపల్లాలో వైఎస్ఆర్ మెమోరియల్ అవార్డ్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం హాజరైయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, కేవీపీ రామచంద్రరావు, రఘువీరారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సుభాష్ పాలేకర్, డాక్టర్ సి.నాగేశ్వరరావు, సి.పద్మకు వైఎస్ఆర్ మెమోరియల్ అవార్డును అందించారు. కొంతమంది మీకు కేవీపీ రామచంద్రరావును అవుతానని తనతో అంటారని, కానీ ఈ తరానికి ఒకే వైఎస్ఆర్, ఒకే కేవీపీ ఉంటారని వాళ్లతో తాను చెప్తుంటానని సీఎం రేవంత్ తెలిపారు. జీవితాంతం ఒక మిత్రుడికి తోడుగా ఉండి అన్నీ చేసిపెట్టడం గొప్ప విషయమన్న సీఎం కేవీపీ కావడం అంత తేలికైన విషయం కాదన్నారు. ఎవరూ అలా ట్రై చేయొద్దని, కొంచెం పక్కకు జరిగితే ఆ సీట్లో కూర్చోవడానికే ప్రయత్నించేవాళ్లు ఎక్కువ ఉన్నారని చమత్కరించారు. మంగళవారం ఉచిత విద్యుత్‌ను ఎవరు ఇచ్చినా వైఎస్ఆర్‌నే గుర్తుకు తెచ్చుకుంటారని, భవిష్యత్‌లోనూ ఎవరూ రద్దు చేయలేని పథకాలను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అమలు చేశారని రేవంత్ రెడ్డి అన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను రద్దు చేసే ధైర్యం ఎవరికీ లేదని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి స్ఫూర్తిని ఈ ప్రభుత్వం కొనసాగిస్తోందని తెలిపారు. రూపాయికి కిలో బియ్యం స్థానంలో ఉచితంగా సన్నబియ్యం ఇస్తున్నామని, ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు వెల్లడిరచారు.

అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే రైతులకు రుణమాఫీని అమలు చేశామని, రుణమాఫీ కింద 26 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.21 వేల కోట్లు జమ చేశామని సీఎం రేవంత్ తెలిపారు. రసాయన ఎరువుల కొనుగోలు రూపంలో మన లక్షల కోట్ల సంపద విదేశాలకు వెళ్తోందని, మన సంపద విదేశాలకు వెళ్లొద్దు అంటే రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. సుభాష్ పాలేకర్ స్ఫూర్తిగా తీసుకుని రైతులు సేంద్రీయ ఎరువును అనుసరించాలని అన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల నిర్మించి రంగారెడ్డి జిల్లాకు నీరు ఇవ్వాలని వైఎస్ఆర్ సంకల్పించారని, గత ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టి రంగారెడ్డి జిల్లాలను నిర్వీర్యం చేసిందని ఆక్షేపించారు.

# రూ.186 కోట్ల వ్యయంతో మెడికల్, నర్సింగ్ కాలేజీలు నిర్మాణం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)



ప్రారంభోత్సవం అనంతరం మంత్రులు మూడవ సంవత్సరం చదువుతున్న దమయంతి, స్వాతి, ప్రకాశ్ పాండే, మైదేహి వర్మ, అనీషా, యతేశం తదితర వైద్య విద్యార్థులతో స్వయంగా మాట్లాడి వారి అనుభవాలు, అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ, పకడ్బందీ ప్రణాళికలతో ముందుకు సాగుతోందని చెప్పారు. జిల్లాకు ఇప్పటికే 18 టన్నుల యూరియా చేరిందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరింత కోటా సాధించేందుకు మంత్రివర్గం త్వరలో ఢిల్లీకి వెళ్లనుందని వివరించారు. వైద్య ఆరోగ్యశాఖ బలోపేతానికి పదోన్నతులు కల్పించి, అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు.

# రేవంత్ రెడ్డికి వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో పెద్ద ఊరట లభించింది. నాలుగేళ్ల క్రితం నమోదైన ఒక కేసులో వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాల్సిన అవసరం లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ మేరకు ఆయనకు మినహాయింపు ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే, 2021లో ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమం చేపట్టాయి. ఈ ఘటనపై సైఫాబాద్ పోలీసులు రేవంత్ రెడ్డితో పాటు పలువురిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ఈ కేసు నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ దశలో ఉంది. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి, తనపై నమోదైన ఈ కేసును పూర్తిగా కొట్టివేయాలని కోరుతూ ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం, కింది కోర్టులో విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావడం నుంచి ఆయనకు మినహాయింపు ఇచ్చింది. ఈ వ్యవహారంపై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వరరావును హైకోర్టు ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను వచ్చే నెల, అనగా అక్టోబర్ 7వ తేదీకి వాయిదా వేసింది.

# కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే ప్రసక్తే లేదు

(మొదటి పేజీ తరువాయి)



మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ కవిత చేసిన తాజా వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి సొమ్ము పంపకాల్లో తేడాలు రావడం వల్లే ఇప్పుడు కవిత ఆరోపణలు చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి బాగోతాన్ని కవిత పూర్తిగా బహిర్గతం చేయాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాజకీయాల్లో మంగళవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై కఠిన చర్యలు తీసుకున్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న కారణంతో ఆమెను పార్టీ నుంచి తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీలోని కీలక నేతలు హరీశ్ రావు, సంతోష్ రావులపై కవిత బహిరంగంగా విరుచుకుపడిన నేపథ్యంలో బీఆర్ఎస్ అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకుంది. అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన వెంటనే, హరీశ్ రావు, మాజీ ఎంపీ సంతోష్ కుమార్, మాజీ రాజ్యసభ సభ్యుడు మేఘా కృష్ణారెడ్డిపై కవిత తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కేసీఆర్ ప్రతిష్ఠకు వీరే మచ్చ తెచ్చారని ఆమె ఆరోపించారు. కేసీఆర్ చుట్టూ ఉన్న కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పెద్ద కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారని, వారి వల్లే ఇప్పుడు కేసీఆర్ సీబీఐ విచారణను ఎదుర్కోవాల్సి వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "ఐదేళ్లు నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసిన హరీశ్ రావుకు ఈ విషయంలో ప్రధాన పాత్ర లేదా?" అని కవిత సూటిగా ప్రశ్నించారు.

# బీఆర్ఎస్ నుంచి కవిత సస్పెన్షన్

(మొదటి పేజీ తరువాయి)



ఇదే సమయంలో, హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి, సంతోష్ రావులకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ పరిణామంతో జాగృతి కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా జాగృతి నేతలు మాట్లాడుతూ, కవితను పార్టీ నుంచి బహిష్కరించడం వల్ల ఆమెకు ఎలాంటి నష్టం జరగదని అన్నారు. తన తండ్రి కేసీఆర్‌పై సీబీఐ విచారణను ఆమె తట్టుకోలేకపోయారని తెలిపారు. చాలా రోజులుగా కవితను పార్టీకి దూరం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని వారు ఆరోపించారు. సామాజిక తెలంగాణ కోసమే కవిత పోరాడుతున్నారని, బడుగు బలహీన వర్గాలు ఆమె వెంటే ఉంటాయని స్పష్టం చేశారు. కవిత ఏ నిర్ణయం తీసుకున్నా తాము కట్టుబడి ఉంటామని తేల్చిచెప్పారు. మరోవైపు, ఈ తాజా పరిణామాలపై ఎమ్మెల్సీ కవిత తన సన్నిహితులతో సమాలోచనలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ నిర్ణయం నేపథ్యంలో, తన ఎమ్మెల్సీ పదవితో పాటు పార్టీ సభ్యత్వానికి కూడా రాజీనామా చేయాలని ఆమె నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ అంశాలపై స్పష్టత ఇచ్చేందుకు ఆమె మీడియా ముందుకు వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# మొన్న కాళేశ్వరం కూలింది, నిన్న బీఆర్ఎస్ కూలింది

(మొదటి పేజీ తరువాయి)



రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతి కేసు విషయంలో కేంద్రానికి లేఖ రాసిందని తెలిపారు. సీబీఐతో దర్యాప్తు చేయాలంటూ.. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం విషయంలో 22 నెలల నుంచి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు కాలయాపన చేశారో.. తెలంగాణ ప్రజలకు జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పీసీసీ ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో తన దగ్గర ఆధారాలు ఉన్నాయని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి, ఇప్పుడు సీబీఐకి ఆ ఆధారాలు ఇచ్చి విచారణకు సహకరించాలని ఎంపీ లక్ష్మణ్ సూచించారు. కాగ్ కూడా అవినీతి జరిగింది, లోపాలు ఉన్నాయాని చెప్పిందని స్పష్టం చేశారు. ఘోష్ కమిషన్ నివేదికలో క్రిమినల్ రిఫరెన్స్ లేకుండా నాయకులు, అధికారులు, కాంట్రాక్టర్ల పాత్ర ఏంటో స్పష్టంగా చెప్పలేదని ఆరోపించారు. ఎమ్మెల్సీ కవిత బహిరంగంగా హరీష్ రావు, సంతోష్ అవినీతికి పాల్పడ్డారు అని చెప్పారని గుర్తు చేశారు. హరీష్ రావు, సంతోష్ అవినీతి అనకొండలు అని చెప్పిందని స్పష్టం చేశారు. ఇరువురు తెలంగాణ ఆస్తులు కొల్లగొట్టారని విమర్శించారు. రాష్ట్ర ఏర్పాటుకు అనేక మంది యువత, ఉద్యోగులు, ప్రజలు తెలంగాణ కోసం పోరాటం చేశారని గుర్తు చేశారు. అమరుల త్యాగాలను కేసీఆర్ కుటుంబం క్యాష్ చేసుకుని, కోట్లకు పడగలు ఎత్తిందని మండిపడ్డారు. నిష్పక్షపాతంగా సీబీఐ దర్యాప్తు జరగాలి, అవినీతిపరులకు శిక్ష పడాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను బలిపశువును చేసారని కవిత అంటున్నారు, అంటే హరీష్ రావు, సంతోష్ రావుల అవినీతి కేసీఆర్‌కు తెలుసా అని అనుమానం వ్యక్తం చేశారు. కాళేశ్వరం అవినీతిలో అధికారులు, కాంట్రాక్టులు ఎవరున్నా వారిని శిక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.



# మూడురోజులు భారీ వర్షాలు..

(మొదటి పేజీ తరువాయి)

ఆసిఫాబాద్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సంగారెడ్డి, వరంగల్, వికారాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బుధవారం ఆదిలాబాద్, కొత్తగూడెం, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని చెప్పింది. గురువారం ఆదిలాబాద్, కొత్తగూడెం, హన్మకొండ, హైదరాబాద్, జగిత్యాల, భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, కామారెడ్డి, కరీంనగర్, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మెదక్, మల్కాజ్‌గిరి, ములుగు, నారాయణపేట, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, వనపర్తి, వికారాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో ఆదిలాబాద్, జగిత్యాల, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, ములుగు, హన్మకొండ, వరంగల్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో 11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

# ఆన్‌లైన్ బెట్టింగ్ గ్యాంగ్ అరెస్ట్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

నగరంలో మరో ఆన్‌లైన్ బెట్టింగ్ గ్యాంగ్ గుట్టురట్టైంది. నగర్‌లో అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్ రాకెట్‌ను టాస్క్ ఫోర్స్ (సౌత్) టీమ్ సోమవారం అరెస్ట్ చేసింది. నిషేధిత ఖేలో గేమ్స్ బెట్టింగ్ యాప్‌లను నిర్వహిస్తున్న ముఠాకు సంబంధించిన ఎనిమిది మందిని అరెస్టు చేసింది. ఈ ముఠా ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం పలు రకాల మొబైల్ అప్లికేషన్‌లను ఉపయోగిస్తోంది. మారు వ్యక్తుల పేర్లతో యూజర్ ఐడీలు, బ్యాంక్ ఖాతాలను సృష్టించి జోరుగా దందా నిర్వహిస్తున్నారు. అరెస్టయిన నిందితులను జి వినయ్ కుమార్, ఎన్ సాయి వర్ధన్ గౌడ్, డి రాహుల్, డి జెశ్వంత్ తేజ, వేణు గోపాల్, కె రామ్, వేల్పుల ఆకాష్, డి ప్రణయ్‌గా గుర్తించారు. మరో ఇద్దరు కీలక నిందితులు కరీంనగర్‌కు చెందిన రాజేష్, అస్లాం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బెట్టింగ్ రాకెట్‌ను నడపడానికి ఈ ముఠా ఏకంగా 235 యూజర్ ఐడీలను జనరేట్ చేసి, కమిషన్ ప్రాతిపదికన యువతను వల్లో వేసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ సౌత్‌జోన్, ఎస్.ఆర్.నగర్ పోలీసుల సంయుక్తంగా చేసిన ఈ దాడిలో నిందితుల నుంచి 18 మొబైల్ ఫోన్లు, 3 బ్యాంక్ పాస్‌బుక్‌లు, 13 ఏటీఎం కార్డులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే రూ. రూ. 29,81,000 లక్షల విలువైన ఆన్‌లైన్ లావాదేవీలను స్తంభింపజేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న ఎస్ఆర్ నగర్ పోలీసులు, దర్యాప్తు చేస్తున్నారు.






# ఫర్టిలైజర్ షాపుపై డా. రాజయ్య ఆకస్మిక తనిఖీ

## రైతుల కష్టాలు భరించలేనివి కాంగ్రెస్, బీజేపీ అబద్ధాలపై మండిపడ్డ బీఆర్ఎస్ సీనియర్ నేత

**స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లి గ్రామంలో యూరియా కొరతపై రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను ప్రత్యక్షంగా గమనించిన మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డా. తాటికొండ రాజయ్య మంగళవారం ఫర్టిలైజర్ షాపును ఆకస్మికంగా తనిఖీ చేశారు.

**రైతుల పరిస్థితి దయనీయం**

ఉదయం నుండి వందలాది రైతులు బారులు తీరి నిలబడటం రాజయ్య గమనించారు.

కేవలం 200 బస్తాల యూరియా మాత్రమే అందుబాటులో ఉండగా, 500 మందికి పైగా రైతులు అవసరం ఉందని ఏఈఓ సమాచారం ఇచ్చారు.

"ఐదు ఎకరాలకు ఒక బస్తా మాత్రమే ఇస్తున్నాం" అన్న ఏఈఓ సమాధానంపై రాజయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు.

> **"రైతులు కష్టాల్లో, కాంగ్రెస్–బీజేపీలు నాటకాలలో!" – రాజయ్య**
>
> డా. రాజయ్య ఆగ్రహంగా మాట్లాడుతూ .. రైతులు యూరియా లేక వేదన పడుతుంటే, కాంగ్రెస్–బీజేపీలు మాత్రం ఒకరి మీద ఒకరు నిందలు వేసుకుంటూ కాలం గడుపుతున్నారు. ఇది రైతులపై నేరం కాదా? రైతుల కన్నీళ్లతో రాజకీయాలు ఆడే హక్కు ఎవరికీ లేదు." ఐదు ఎకరాలకు ఒక్క బస్తా యూరియా అంటే అది దారుణం, రైతులపై క్రూరమైన దాడి వంటిది. వెంటనే యూరియా సరఫరా చేయాలి. లేకుంటే బీఆర్ఎస్ పార్టీ రైతుల కోసం రోడ్లపైకి దిగుతుంది. ధర్నాలు, నిరసనలు తప్పవు."

కడియం శ్రీహరి అబద్ధాలపై దాడి

ఒకవైపు రైతులు లైన్‌ల్లో నిలబడి కష్టాలు పడుతుంటే, మరోవైపు మోసకారి కడియం శ్రీహరి మాత్రం 'యూరియా కొరత లేదు' అని అబద్ధాలు చెబుతున్నాడు. రైతుల సమస్యలపై సమీక్ష కూడా చేయని ఈ ఎమ్మెల్యేకు గద్దె మీద కూర్చోబెట్టే హక్కు లేదు." ఇంకా ఆలస్యం చేస్తే వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి. లేకపోతే రైతులు, బీఆర్ఎస్ కలిసి బలమైన పోరాటం చేస్తారు" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, రైతులు పాల్గొన్నారు.




# సీఎం ప్రజావాణికి బ్యాటరీ వాహనం

## వృద్ధులు, వికలాంగులకు ఉచిత రవాణా సదుపాయం

**వనపర్తి,సెప్టెంబర్02(తెలంగాణ ముచ్చట్లు):** ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం ప్రజావాణి కార్యక్రమానికి మరో కొత్త సౌకర్యం కల్పించారు. వృద్ధులు, వికలాంగులు ఇకపై ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రధాన గేటు నుండి భవనానికి చేరుకునేలా బ్యాటరీ వాహనంను అందుబాటులోకి తీసుకువచ్చారు. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, ప్రజావాణి ఇన్చార్జి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ వాహనానికి పూజలు చేసి లాంఛనంగా ప్రారంభించారు. సుమారు ₹ 7 లక్షల విలువ గల ఈ బ్యాటరీ వాహనం ద్వారా వృద్ధులు, వికలాంగులు ప్రధాన రహదారి గేటు నుండి పిటిషన్లు అందజేసే భవనం వరకు ఉచిత రవాణా సదుపాయం పొందనున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, "ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి సమస్యను సమర్థవంతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. వృద్ధులు, వికలాంగులకు సులభ రవాణా సదుపాయం కల్పించడం కూడా ఆ దిశలో భాగమే" అని తెలిపారు.




# గణపయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలి

**సింగపురం ఇమ్మానియేల్ రాజ్**

**స్టేషన్‌ఘనపూర్, సెప్టెంబర్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** విఘ్నాలను తొలగించే ఆది దేవుడు గణపయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలని స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, సింగపురం ఇంద్ర తనయుడు యువ నాయకుడు సింగపురం ఇమ్మానియేల్ రాజ్ ఆకాంక్షించారు. మంగళవారం ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల గ్రామంలో సహారా స్టార్ మేకర్స్ యూత్ కమిటీ ఏర్పాటు చేసిన వినాయక మండపంలో జరిగిన పూజల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం గణపతి ఉత్సవాల్లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, గ్రామ ప్రజలతో, యువకులతో కలిసి గణపయ్య ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్లూరి మౌనిక, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ జీడి కొర్నెల్, నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రడపాక రాజ్‌కుమార్, మండల ఎంపీటీసీ మాజీ అధ్యక్షుడు సింగపురం దయాకర్, మండల మహిళా అధ్యక్షురాలు చింత జ్యోష్న, మండల ప్రధాన కార్యదర్శి నారాగోని పద్మ, ధర్మసాగర్ మండల కోఆర్డినేటర్ భిక్షపతి, చీల్పూరు దేవస్థానం మాజీ డైరెక్టర్ వికాస్ రెడ్డి, నాయకులు తాటికొండ సంపత్, సరిత, సుమలత, యువ నాయకులు ప్రతిష్, ప్రశాంత్, సురేష్, కిషోర్, ప్రణయ్, వినయ్, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

# కాలనీల్లో వాటర్ సమస్యలపై దృష్టి



**జలమండలి ఏఈతో కలిసి సర్వే చేసిన ముప్పు శ్రీనివాస్ రెడ్డి**

**నాగారం, సెప్టెంబర్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ నియోజకవర్గం నాగారం మున్సిపల్ పరిధిలోని వి.ఎస్.టి మరియు సాయిబాబా కాలనీల్లో నీటి సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఆయన జలమండలి అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) సాయికిరణ్ గౌడ్‌తో కలిసి కాలనీల్లో పర్యటించి, వాటర్ పైపులైన్, కనెక్షన్ల స్థితిగతులను సమీక్షించారు. పర్యటన సందర్భంగా కాలనీల్లో తాగునీటి కనెక్షన్ల సమస్యలను ఏఈ సాయికిరణ్ గౌడ్ ప్రత్యక్షంగా విని, తగిన చర్యలు తీసుకోవాలని హామీ ఇచ్చారు. పైపులైన్ విస్తరణ, కొత్త కనెక్షన్ల ఏర్పాటు, పాత పైపులైన్ల మరమ్మత్తులపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి త్వరితగతిన సమస్యలను పరిష్కరించనున్నట్టు తెలిపారు. కాలనీ వాసులు నీటి సరఫరా లోపం, కనెక్షన్ల లోటు వంటి సమస్యలను ప్రస్తావించగా, అధికారుల సమన్వయంతో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ముప్పు శ్రీనివాస్ రెడ్డి భరోసా ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం తమ ప్రధాన బాధ్యతగా పేర్కొన్నారు. ఈ సర్వేలో రాజ్ సుఖ్ నగర్ కాలనీ అధ్యక్షుడు దాస్, వి.ఎస్.టి కాలనీ అధ్యక్షుడు మనోహర్, నాగారం 16వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వేణుగోపాలరావు, మాదిరెడ్డి రాజిరెడ్డి, స్థానిక నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



# రూ! 1 కోటి 84 లక్షలతో చిల్కానగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- **అభివృద్ధిలో నంబర్ 1 చిల్కానగర్ డివిజన్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**చిల్కానగర్, సెప్టెంబర్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం చిల్కానగర్ డివిజన్ మౌలిక వసతుల అభివృద్ధిలో మరో కీలక అధ్యాయాన్ని ప్రారంభించింది. ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి మరియు చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ కలిసి సుమారు రూ! 1 కోటి 84 లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న సీవరేజ్ లైన్లు, స్టార్మ్ వాటర్ డ్రైన్లు, రోడ్ల మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అభివృద్ధి ప్రాధాన్యత:ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి మాట్లాడుతూ,చిల్కానగర్ డివిజన్ అభివృద్ధిలో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తోంది. ప్రతి కాలనీ, ప్రతి వీధికి తగిన సౌకర్యాలు కల్పించేందుకు దశలవారీ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. ఈ పనులు పూర్తయిన తర్వాత వర్షాకాలంలో వచ్చే నీటిమునిగే సమస్యలు తగ్గిపోతాయి. ఆధునిక మౌలిక వసతులతో డివిజన్‌ను మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తాం, అని తెలిపారు.ప్రజలు, కాలనీ కమిటీలు అభివృద్ధి పనుల పర్యవేక్షణలో భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రజల సూచనలు కూడా అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతిబింబించేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీ అధ్యక్షులు, కార్యదర్శులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శంకుస్థాపన ప్రాంతాల్లో పూలదండలు, శంఖనాదాలు, మేళాలతో ఘన స్వాగతం పలికారు. స్థానికులు ఎమ్మెల్యే మరియు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.సమగ్ర ప్రణాళికలో భాగం:చిల్కానగర్‌లో ప్రస్తుత పనులు రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలో భాగమని, రాబోయే నెలల్లో మరిన్ని అభివృద్ధి ప్రాజెక్టులు అమలు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రహదారుల విస్తరణ, పార్కులు, స్ట్రీట్‌లైట్లు వంటి పనులు కూడా దశలవారీగా జరుగుతాయని హామీ ఇచ్చారు.



# వెంకట రమణకు వైద్యసాయం ఆర్థిక అండ కల్పిస్తానన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి

- ***కరెంట్ షాక్ ఘటన బాధితుల కోసం కదిలిన ఉప్పల్ ఎమ్మెల్యే**

**ఉప్పల్, సెప్టెంబర్ 2(తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం రామంతాపూర్‌లో చోటుచేసుకున్న కరెంట్ షాక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకట రమణకు ప్రభుత్వ సహాయాలు అందేలా చూడాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు.మంగళవారం ఆయన ఉప్పల్ ఎంఆర్ఓ కార్యాలయాన్ని సందర్శించి ఈ ఘటనపై అధికారులతో చర్చించారు. వెంకట రమణ పేరును అధికారిక గాయపడిన వారి జాబితాలో చేర్చాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఆరుగురు కుటుంబాలకు సానుభూతి ప్రకటించిన ఆయన, గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ఈ ప్రమాదం బాధాకరం. గాయపడిన ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిని ప్రభుత్వం నిశితంగా పర్యవేక్షించాలి. వైద్యం నుంచి ఆర్థిక సహాయం వరకు అన్ని విధాలా వారిని ఆదుకోవాలి. వెంకట రమణ గారు పూర్తిగా కోలుకునే వరకు నేను వ్యక్తిగతంగా అండగా ఉంటాను" అని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక ప్రజలతో కూడా మాట్లాడి, ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ప్రమాదానికి కారణాలను సవివరంగా విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.రామంతాపూర్‌లో జరిగిన ఈ ఘటన స్థానికులను తీవ్ర ఆవేదనకు గురిచేసింది. ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం తక్షణం సాయం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

# మ్యాన్ హోల్ లో పడి టెన్త్ విద్యార్థికి తీవ్ర గాయాలు

**సత్తుపల్లి, సెప్టెంబర్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి పట్టణంలో ఓపెన్‌గా వదిలేసిన మ్యాన్ హోల్‌లో పడి టెన్త్ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. జలగం నగర్ కాలనీకి చెందిన వెలగల సాయి ఆదర్శ్ సోమవారం రాత్రి ట్యూషన్ ముగించుకుని ఇంటికి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం ఎదుట ఉన్న మ్యాన్ హోల్ చీకట్లో కనిపించకపోవడంతో ఆదర్శ్ అందులో పడిపోయాడు. దీంతో అతనికి తలకు, శరీరానికి గాయాలయ్యాయి. తోటి విద్యార్థులు గమనించి వెంటనే ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తున్నారు.



ఈ ఘటనపై బాధిత విద్యార్థి తండ్రి రామకృష్ణ మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు పరిశీలిస్తామని తెలియజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి : సీపీఎం

**పెనుబల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా..**

**పెనుబల్లి, సెప్టెంబర్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రామాల్లో తక్షణమే పారిశుద్ధ్య సమస్యలు, వీధి దీపాలు, సైడ్ డ్రెయిన్ సమస్యలు పరిష్కరించాలని సీపీఎం పెనుబల్లి మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం తహశీల్దార్, ఎమ్మార్వో, ఎండిఓ కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టి, వినతిపత్రాలను అధికారులకు అందజేశారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠ్ఠలావు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం పూర్తిగా దెబ్బతిన్నదని, వర్షాల కారణంగా విషజ్వరాలు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లకపోవడం, వీధి దీపాలు వెలగకపోవడం వల్ల గ్రామస్తులు కుక్కలు, కోతుల బెడదతో ఇబ్బంది పడుతున్నారని, అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు మాట్లాడుతూ సైడ్ డ్రెయిన్ సమస్యల వల్ల మురికి నీరు నిల్వవడంతో దోమల బెడద విపరీతంగా పెరిగిందన్నారు. కొత్తలంకపల్లి గ్రామంలోని 15 గిరిజన కుటుంబాలకు తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పోడు సాగుదారుల సమస్యలు పరిష్కరించకుండా అధికారులు పట్టాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. రామచంద్రరావు బంజర్ స్మశానవాటిక కేసులను ఎత్తివేయాలని, ఫారెస్ట్ అధికారుల నిర్బంధాలను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రజల సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు హామీ ఇచ్చారు. ఎండిఓ ఆమె కూడా పారిశుద్ధ్య సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు తడిక మండల చిరంజీవి, నల్లమల్ల అరుణ ప్రతాప్, గుడిమెట్ల బాబు, చిమట విశ్వనాథం, రాజునేని మంగమ్మ, చిట్టిమోదుల కృష్ణ, కృష్ణశెట్టి కృష్ణ, పరకాల రాంబాబు పరిగడుపు, వెంకయ్య, తుంగ కృష్ణ, బేతి చిట్టెమ్మ, రాజినేని పాపయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.





# కాళేశ్వరం ప్రాజెక్టుపై అబద్ధపు ప్రచారానికి బిఆర్ఎస్ ధిక్కార నిరసన!

**కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని ఖండించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య.**

**సత్తుపల్లి, సెప్టెంబర్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి నియోజకవర్గం తల్లాడ మండల కేంద్రంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీపై ధిక్కార స్వరం వినిపించింది.

తెలంగాణ గర్వకారణమైన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ ఉద్దేశపూర్వకంగా చేస్తున్న అబద్ధపు ఆరోపణలను ఖండిస్తూ బిఆర్ఎస్ నేతలు రోడ్డెక్కారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రైతు బతుకుకు వరప్రదానం. లక్షల ఎకరాలకు నీటిపారుదల, కోట్ల మందికి తాగునీరు అందిస్తున్న ఈ ప్రాజెక్టును తప్పుడు ప్రచారం ద్వారా అపప్రథకు గురిచేయడం కాంగ్రెస్ దురుద్దేశం తప్ప మరొకటి కాదని మండిపడ్డారు.

అలాగే కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్ర అభివృద్ధికి శక్తినిచ్చిన ప్రాజెక్టు అని స్పష్టం చేస్తూ ప్రజల మద్దతు ఎల్లప్పుడూ బిఆర్ఎస్ పక్షాన ఉంటుందని నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని కాంగ్రెస్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు





# గణనాథుని కటాక్షంతో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

**భక్తుల మనసు గెలిచిన భావన గౌడ్ అన్నదానం**

**నాచారం, సెప్టెంబర్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** నాచారం రాఘవేంద్రనగర్‌లోని ఈగల్ వింగ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. మండపాన్ని కళాత్మకంగా అలంకరించగా, ప్రతిరోజూ గణనాథునికి ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి.ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త భావన గౌడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమె భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించి, స్వయంగా అన్నం వడ్డించి సేవాభావాన్ని చాటుకున్నారు. భక్తుల ఆశీస్సులు అందుకున్న భావన గౌడ్‌ను అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు.ఉత్సవాలకు చిన్నా పెద్దా విస్తృతంగా హాజరై గణనాథుని దర్శించుకుంటూ భక్తి భావంతో పూజలు చేశారు. స్థానికులు, యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఈగల్ వింగ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు వినయ్, అఖిల్, రాహుల్, ప్రవీణ్, శివ, రాకేష్ తదితరులు చురుకుగా వ్యవహరించారు.




## ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిన వైయస్సార్

- **డిఎస్ మహేష్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు**

**వనపర్తి,సెప్టెంబర్2(తెలంగాణ ముచ్చట్లు):** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుడు డిఎస్ మహేష్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. తరువాత డిఎస్ మహేష్ మాట్లాడుతూ వైయస్సార్ నిజమైన ప్రజానాయకుడు, పేదల ఆప్తుడు అని అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందించగా 108 అంబులెన్స్ సేవలతో అత్యవసర సమయాల్లో లక్షలాది మంది ప్రాణాలను కాపాడారని గుర్తుచేశారు. రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ చేయడం ద్వారా వ్యవసాయ రంగానికి ఊపిరి పోశారని పేర్కొన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించి ఉన్నత విద్యకు మార్గం సుగమం చేశారని కొనియాడారు. వైయస్సార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో ఆయనను శాశ్వతంగా నిలిపాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, స్థానిక కార్యకర్తలు పాల్గొని వైయస్సార్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు.





# పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా

**చర్లపల్లి, సెప్టెంబర్ 2 (తెలంగాణ ముచ్చట్లు)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు చక్రీపురంలో మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. ఉప్పల్ నియోజకవర్గ కో ఇన్‌ఛార్జ్ కే. శివ కార్తీక్ నాయుడు ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై, పవన్ కళ్యాణ్ కటౌట్లతో ప్రాంగణాన్ని అలంకరించారు. పుట్టినరోజు సందర్భంగా భారీ కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన అధినేత నాయకత్వం పట్ల విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ, అభిమానులు జై కారాలు చేస్తూ వేడుకల్లో పాల్గొన్నారు. పవన్ కళ్యాణ్ ప్రజల కోసం చేస్తున్న సేవలు, రాజకీయాల్లో తెచ్చిన నైతిక విలువలను గుర్తు చేసుకుంటూ నాయకులు ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు చల్ల ప్రభాకర్, చర్లపల్లి డివిజన్ జనసేన అధ్యక్షుడు ఐ. నాగరాజు, జనసేన డివిజన్ ప్రెసిడెంట్ శివకుమార్, తెలంగాణ రాష్ట్ర వీర మహిళ రత్నపిల్ల, కూటమి నాయకులు, స్థానిక నాయకులు, జనసేన శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**ఖిల్లా ఘనపూర్,సెప్టెంబర్2 (తెలంగాణ ముచ్చట్లు):**

ఖిల్లా ఘనపూర్ మండల కేంద్రానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గౌడుగు సత్యనారాయణ తల్లి మరణించిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. అలాగే మలి దశ తెలంగాణ ఉద్యమకారుడు దోరటి మల్లేష్ తండ్రి దోరటి కేశవులు మరణించగా, ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కె.కృష్ణానాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రాళ్ల కృష్ణయ్య, టి. బాలీశ్వర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సామ్యా నాయక్, మామిడిమాడ రంగారెడ్డి దొర, మాజీ సర్పంచులు మన్యం గౌడ్, దేవరశెట్టి సురేందర్, బాలా ఆంజనేయులు గౌడ్, కృష్ణయ్య గౌడ్, శేఖర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి క్యామ వెంకటేష్, బాల్ రెడ్డి, చిన్న ఆంజనేయులు గౌడ్, రవీందర్ రెడ్డి, అంజిరెడ్డి, గోనెల రామచంద్రి, పల్నాటి సుజేంద్ర పాల్గొన్నారు.

# ఘనంగా వైఎస్సార్ వర్ధంతి వేడుకలు – కొలిపాక సతీష్

- **వైఎస్సార్ చేసిన సేవలు ఎవరూ మరచిపోలేరు**
- **ప్రజల గుండెల్లో ఎప్పటికీ బ్రతికే ఉన్న నాయకుడు వైయస్సార్"**



**స్టేషన్‌ఘనపూర్, సెప్టెంబర్ 2(తెలంగాణ ముచ్చట్లు) :** జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా డా. వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన సేవలు ఎవరూ మరచిపోలేరని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొలిపాక సతీష్ అన్నారు.మంగళవారం స్టేషన్‌ఘనపూర్ మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొలిపాక సతీష్ మాట్లాడుతూ వైఎస్సార్ మరణించినప్పటికీ ప్రజల గుండెల్లో నిత్యం బ్రతికే ఉన్నారు. ఆయన పాలనలో బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు లభించాయి. ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు అమలు చేసిన పథకాలు లక్షలాది ప్రజల జీవితాల్లో వెలుగునింపాయి" అని తెలిపారు.

**వైఎస్సార్ అమలు చేసిన కీలక పథకాలు**

రాజీవ్ ఆరోగ్యశ్రీ - పేదలకు ఉచిత వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు - గృహాల కల నెరవేర్చిన పథకం, ఫీజు రీయింబర్స్‌మెంట్ - విద్యార్థులకు ప్రోత్సాహం, రైతుల రుణమాఫీ - కష్టాల్లో ఉన్న రైతులకు ఊరట, ఉచిత విద్యుత్ - వ్యవసాయ రంగానికి తోడ్పాటు 108, 104 అత్యవసర సేవలు ప్రాణాలు కాపాడిన వైద్యసేవలు, పావలా వడ్డీ రుణాలు - మహిళలకు ఆర్థిక అండ రిజర్వాయర్ల నిర్మాణం సాగునీటి అభివృద్ధి పనులను చేపట్టిన ఘనత వైఎస్సార్ దే అన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌ఛార్జి మామిడ్ల శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జానీ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు రాజు, ఎస్టీ సెల్ జిల్లా నాయకులు అరుణ్, సురేందర్, చట్ల రామ్‌కన్నా, జంపాల శ్రీకాంత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# చెర్లపల్లిలో 250 గజాల స్థలంపై గూండాగిరి

**స్థానిక మహిళ కన్నీటి పర్యవసానం – పోలీసులకు ఫిర్యాదు**

**చెర్లపల్లి, సెప్టెంబర్ 2 (తెలంగాణ ముచ్చట్లు-):** ఉప్పల్ నియోజకవర్గ కాప్రా సర్కిల్లో చెర్లపల్లిలో 250 చదరపు గజాల స్థలంపై అక్రమ ఆక్రమణ, గూండాగిరి, బెదిరింపులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని స్థానిక గృహిణి ఎన్నం పద్మ కన్నీటి పర్యవసానంగా పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే, చెర్లపల్లి మహాలక్ష్మి నగర్, బ్లాక్ 1, ప్లాట్ నంబర్: 144, సర్వే నంబర్: 188లోని 250 గజాల స్థలం ఎన్నం పద్మకు మరియు ఆమె కుటుంబానికి చట్టబద్ధమైన ఆస్తి. ఎన్నం పద్మ భర్త కీ.శే. ఎన్నం లక్ష్మయ్య ఈ స్థలాన్ని 2010లో ముసుగు వెంకన్న (బుచ్చయ్య కుమారుడు) నుండి రిజిస్ట్రేషన్ చేసుకుని కొనుగోలు చేశారు.అప్పటి నుంచి ఆ స్థలానికి సంబంధించి పత్రాలు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, పన్నులు అన్నీ చట్టబద్ధంగానే ఉన్నాయని ఎన్నం పద్మ తెలిపారు. కానీ ఇటీవల చెర్లపల్లి నివాసి పల్లపు శ్రీనివాస్ అనే వ్యక్తి ఆ స్థలంపై అక్రమంగా ఆక్రమణ చేసి, అనుమతి లేకుండా అక్రమ విద్యుత్ కనెక్షన్ తీసుకుని తాత్కాలిక నిర్మాణం, బోర్ బావి తవ్వకాలు ప్రారంభించాడని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.



మేము అతన్ని నిలదీయడానికి ప్రయత్నిస్తే, గూండాలను వెంటబెట్టుకుని వచ్చి మాకు ప్రాణహాని కలిగేలా బెదిరిస్తున్నాడు. మమ్మల్ని అసభ్య పదజాలంతో దూషించడం, మా మీద దాడి ప్రయత్నాలు చేయడం వంటి సంఘటనలు జరుగుతున్నాయి. నేను, నా ముగ్గురు కుమార్తెలు మా సొంత స్థలంలో అడుగుపెట్టలేని పరిస్థితి. ప్రస్తుతం మా ప్రాణాలకు ముప్పు ఉందని భావించి చెర్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసాం, అని ఎన్నం పద్మ కన్నీటి పర్యవసానంగా వెల్లడించారు.

స్థానికులు ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "ఇది చట్టరహిత స్థితిని సూచించే సంఘటన. ఒక స్త్రీ తన సొంత ఆస్తి కోసం ఇలా పోలీస్ స్టేషన్ తిరగాల్సిన పరిస్థితి రావడం బాధాకరం" అని పలువురు అభిప్రాయపడ్డారు.

పోలీసుల చర్యపై ప్రజల ఆశలు:ఫిర్యాదు స్వీకరించిన చెర్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. స్థానికులు ఈ ఘటనపై కఠిన చర్యలు తీసుకుని ఆస్తిని చట్టబద్ధ యజమానులకు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు.




# రేవంత్ రెడ్డి, కడియం శ్రీహరి జాగ్రత్త..!

**మాజీ ఎమ్మెల్యే రాజయ్య**
**"కేసీఆర్‌పై కుట్ర చేస్తే తెలంగాణ రగిలిపోతుంది" – రాజయ్య హెచ్చరిక**
**"రైతన్నల కన్నీళ్లు తుడవలేని కాంగ్రెస్ నేతలకు పాలన చేసే అర్హత లేదు"**
**"30% కమిషన్ లేకుండా ప్రాజెక్టులు కదలడం లేదు"**
**"కడియం శ్రీహరి అబద్ధాలే జీవనాధారం"**
**మాటలతో కాదు... పనులతో చూపించాలి**

**స్టేషన్ ఘన్ పూర్ : సెప్టెంబర్ 2 (తెలంగాణ ముచ్చట్లు)**

"రేవంత్ రెడ్డి...కడియం శ్రీహరి...మీరు ఎంత నాటకాలు ఆడినా, ఎంత పేపర్ స్టేట్మెంట్‌లు ఇచ్చినా ప్రజలు నమ్మరు. మా నాయకుడు కేసీఆర్‌పై ఈగ వాలినా తెలంగాణ అగ్నిపర్వతంలా పేలిపోతుంది" అని మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఘాటుగా హెచ్చరించారు.

యూరియా కొరత – రైతన్నలకు ద్రోహం
"రైతులు ఎరువుల కోసం క్యూల్లో బూట్లు పెట్టుకుని తిరుగుతున్నారు. ఇది పాలన కాదు, ద్రోహం."
"ఘన్‌పూర్‌లో యూరియా కొరత లేదని చెప్పిన కడియం...వాస్తవానికి గోదాముల గోడలపై 'స్టాక్ లేదు' బోర్డులు పెట్టించుకున్నాడు. అబద్ధాలే ఆయుధంగా చేసుకున్న నేత."
"మా పాలనలో యూరియా బస్తాలు రైతు ఇంటికే చేరాయి. ఇప్పుడు రైతు బస్తా కోసం తలదించుకోవాల్సిన పరిస్థితి... కాంగ్రెస్ పాలన సిగ్గుపడే స్థాయిలో విఫలమైంది."

ఎత్తిపోతల పనులు – అవినీతి కాళ్లకింద పడ్డాయి
"రూ.104 కోట్ల ప్రాజెక్ట్ పనులు 30% కమిషన్ లేకుండా కదలడంలేదట! ఇదే కాంగ్రెస్, కడియం పరిపాలన శైలి."
"లక్షల ఎకరాలు నీరులేక ఎండిపోతుంటే వీళ్లు కుర్చీలు, కాంట్రాక్టులు పంచుకోవడమే పట్టిస్తున్నారు."
"పంటలు పాడైనా పట్టించుకోని నాయకులు ప్రజల ముఖం చూడటానికి సిగ్గుపడాలి."

కాళేశ్వరం – తెలంగాణ గర్వం, కాంగ్రెస్ కుట్ర
"కేసీఆర్ రాత్రింబవళ్లు కష్టపడి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై అబద్ధపు ఆరోపణలు... ఇది తెలంగాణ ప్రజల తలపై రాయి కొట్టడమే."
"ఆంధ్రాకు నీళ్లు తరలించాలనే కుట్రతో కాంగ్రెస్ బనకచర్ల ప్రాజెక్ట్‌ను బ్రతికించాలని చూస్తోంది."




"కేసీఆర్‌ను జైలుకి పంపాలన్న దురుద్దేశంతో కాంగ్రెస్ కాళేశ్వరం మీద బురద చల్లుతోంది. ఇది ప్రజలే తిప్పికొడతారు."

కడియం శ్రీహరి – అబద్ధాలే జీవనాధారం
"నేనే దొంగనని నోరు జారిన వాడు... ఈరోజు రైతన్నలకు న్యాయం చేస్తాడా?"
"ఒక సంవత్సరం అవుతున్నా ఒక్క మంచి పని చెప్పలేని అశక్తుడు. మిగిలిందల్లా నాటకాలు, ప్రహసనాలు."
"పాదయాత్రలతో బట్టబయలైన వాస్తవాలను తట్టుకోలేక రేవంత్ దగ్గరికి వెళ్లి డబ్బులు అడగడం... ఇదే కడియం స్థాయి!
"దేవాదుల పనులు 90% పూర్తయ్యాయి. మిగతావి కూడా వెంటనే పూర్తి చేయకపోతే ఘన్‌పూర్ ప్రజలు మిమ్మల్ని క్షమించరు."
"పేపర్ స్టేట్మెంట్‌లు కాదు... పనులు చూపించండి. లేని పక్షంలో ప్రజలు మీ కుర్చీలను ఎగరేస్తారు."
"రైతన్నల కోసం బీఆర్ఎస్ పోరాటం ఎప్పటికీ ఆగదు. మళ్లీ పాదయాత్రలతోనే మీ అవినీతిని, వైఫల్యాన్ని బయటపెడతాం."

ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్, మరపక రవి, మారేపల్లి ప్రసాద్ చందర్ రెడ్డి, ఖాదర్ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిల్కానగర్ లో గణేష్ మండపలను సందర్శన పరమేశ్వర్ రెడ్డి

**ప్రజల ఆయురారోగ్యాల కోసం గణనాధుని ఆశీర్వాదాలు కోరుకున్న పరమేశ్వర్ రెడ్డి**




**చిల్కానగర్, సెప్టెంబర్ 2 (తెలంగాణ ముచ్చట్లు)**: ఉప్పల్ నియోజకవర్గం చిల్కానగర్ ప్రాంతంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు విశేషంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు అమర్, సత్యం ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటు చేసిన గణనాధుని మండపాన్ని మంగళవారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డి సందర్శించారు. మండపంలో ప్రతిష్టించిన విఘ్నేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రతి ఇంటా శాంతి, సౌభ్రాతృత్వ వాతావరణం నెలకొని, ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని గణనాధుని ఆశీస్సులు కోరుకుంటున్నాను" అని అన్నారు. గణేష్ నవరాత్రులు ప్రజలందరికి ఆధ్యాత్మిక శక్తిని అందిస్తాయని ఆయన పేర్కొన్నారు.పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని, ప్రజలకు అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. ఉత్సవాల ద్వారా సామాజిక సౌభ్రాతృత్వం పెరుగుతుందని ఆయన గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో ఆకిటి ఆగం రెడ్డి, బుత్కూరి సోను గౌడ్, జగదీష్, రవి, నవాబ్ తదితర వినాయక మండప సభ్యులు పాల్గొని పూజా కార్యక్రమాల ను నిర్వహించారు. మండప ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది.

# ఉప్పల్‌లో గణనాథుని దర్శించిన కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

**విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ఉప్పల్ ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థించిన కార్పొరేటర్**




**ఉప్పల్, సెప్టెంబర్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ డివిజన్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి గణనాథుడి ఆలయాలు, మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, "విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ఉప్పల్ వాసులందరిపైనా ఉండాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ప్రతి కుటుంబం వర్ధిల్లాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.ఉత్సవాల సందర్భంగా కురుమనగర్, ఉప్పల్ హిల్స్, లక్ష్మీనర్సింహ కాలనీ, న్యూ శాంతినగర్ మండపాలను సందర్శించిన ఆయన, స్థానిక ఉత్సవ కమిటీ సభ్యులతో చర్చించి పూజల్లో పాల్గొన్నారు. తరువాత ఆయన అన్నదాన కార్యక్రమంలో కూడా పాలుపంచుకున్నారు.

ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు కార్పొరేటర్‌ను సత్కరించి, ఉత్సవ నిర్వహణకు మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సవ ప్రాంతాల్లో భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఉప్పల్ ప్రాంతమంతటా శోభాయమానంగా జరుగుతున్నాయి. మండపాల వద్ద భక్తుల రద్దీ అధికంగా కనిపిస్తోంది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, హరినామసంకీర్తనలు, అన్నదానాలు భక్తులలో ఉత్సాహాన్ని నింపుతున్నాయి.



# అన్నదాతకు అండగా బీఆర్ఎస్

**ఖిల్లా ఘనపూర్, సెప్టెంబర్2 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచింది. ఖిల్లా ఘనపూర్ మండల కేంద్రంలోని పీఎసీసీ కార్యాలయం వద్ద రైతులను కలసిన బిఆర్ఎస్ నాయకులు, వారి గోడును విని ఖిల్లా ఘనపూర్ చౌరస్తా లో వద్ద ధర్నా నిర్వహించారు. రైతులు – "15 రోజులుగా వరుసలో నిలబడి రెండు బస్తాలు మాత్రమే దొరుకుతున్నాయి. 7-8 ఎకరాల పంటకు కనీసం 15 బస్తాలు కావాలి. మిగతా ఎకరాలకు యూరియా లేక పంట పాడవుతోంది" అని వేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ చైర్మన్ కే.లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్, మండల అధ్యక్షులు రాళ్ల కృష్ణయ్య మాట్లాడుతూ – "కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారంలో విఫలమైంది. రైతులకు అవసరమైనంత యూరియా సరఫరా అయ్యేవరకు బిఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుంది" అని హెచ్చరించారు.



# సెకండ్ ఏఎన్ఎంలు సీఐటీయూలో చేరిక.!

- **ఉద్యోగుల ఆత్మగౌరవం కాపాడే సంఘమే టీయూఏఎంహెచ్‌యూ – జాల**

**సత్తుపల్లి, సెప్టెంబర్ 02 (తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం జిల్లా, వేంసూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు సీఐటీయూ అనుబంధ తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్‌లో మంగళవారం చేరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జాల కొండలరావు, బండారు వేణుగోపాల్, రాష్ట్ర కమిటీ సభ్యులు కాసాని వీరయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మల్లూరు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మాదాసు కృష్ణవేణి, డి.సుమలత, ఖమ్మంపాటి మారేశ్వరి, వేముల కృష్ణవేణి లను సంఘంలో చేర్చుకున్నారు.

ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ హక్కుల సాధన కోసం నిజాయితీగా పోరాడే సంఘమే టీయూఏఎంహెచ్‌యూ అని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఎర్ర కేశవరావు, శ్రీనివాస్, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.



# దివంగత మహానేత వైఎస్‌కు ఘన నివాళి

**వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి**

**వనపర్తి,సెప్టెంబర్2(తెలంగాణ ముచ్చట్లు):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాజీ ముఖ్యమంత్రి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఘన నివాళి అర్పించారు.

మంగళవారం హైదరాబాద్ మాదాపూర్‌లోని కార్యాలయంలో వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 108 అంబులెన్స్ సేవలు ప్రవేశపెట్టి అత్యవసర వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు ఆయన ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించారని గుర్తుచేశారు రైతుల పక్షపాతిగా ఉచిత విద్యుత్ రుణమాఫీ వంటి పథకాలతో రైతులకు ఊరట కలిగించారని అన్నారు ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చేసి వేలాది కుటుంబాలకు ఆశాకిరణంగా నిలిచారని తెలిపారు మహిళలకు పావుల వడ్డీ రుణాలు అందించి స్వావలంబన దిశగా నడిపించారని ఆయన వివరించారు

ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్న నాయకుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని ఎమ్మెల్యే మేఘారెడ్డి కొనియాడారు

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్ ఎస్ ఎల్ ఎన్ రమేష్ ఆర్యభవన్ శీను కొత్తకోట శేఖర్ తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# కాళేశ్వరం పై కాంగ్రెస్ విషప్రచారం – నిరసనలో బీఆర్ఎస్ ఆగ్రహం

## కె.సి.ఆర్ జోలికొస్తే తెలంగాణ అగ్నిగుండమే మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి,సెప్టెంబర్02(తెలంగాణ ముచ్చట్లు):** కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఘాటు విమర్శలు గుప్పించారు.

"ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్, టిడిపి పార్టీలు గోదావరి-కృష్ణా నదులపై ఒక్క ప్రాజెక్టు కట్టకపోవడం తెలంగాణకు తీరని ద్రోహం. కానీ కేసీఆర్ పాలనలో కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులు పూర్తి చేసి లక్షల ఎకరాలకు సాగునీరు అందించారు. అలాంటి మహా నాయకుడిపై కమిషన్ వేయడం రేవంత్ పైశాచిక ఆనందం తప్ప మరేమీ కాదు" అని ఆయన అన్నారు.

అలాగే - "రెండు ఏళ్లు పూర్తయ్యినా కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు మిగిలిన పనులు పూర్తి చేయలేకపోయింది. తమ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికే కేసీఆర్‌పై దుష్ప్రచారం చేస్తోంది. నిజంగా రేవంత్ పాలమూరు బిడ్డ అయితే ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు నీరు అందించాలి" అని సవాల్ విసిరారు.

రాహుల్ గాంధీ ఒకవైపు సీబీఐ, ఐటీ, ఈడీపై విమర్శలు చేస్తూ ఉంటే, రేవంత్ మాత్రం అదే సంస్థల విచారణ కోరడం మోడీ కోసమే పనిచేస్తున్నారన్న దానికి నిదర్శనమని నిరంజన్ రెడ్డి వ్యాఖ్యానించారు. "ఎన్ని కమిషన్లు వేసినా కేసీఆర్‌కు ఏమి చేయలేరు. రాబోయే ఎన్నికల్లో రైతులు, ప్రజలు మళ్లీ కేసీఆర్ అండగా నిలిచి రేవంత్ అబద్ధాలకు తగిన బుద్ధి చెబుతారు" అని ధీమా వ్యక్తం చేశారు.

తరువాత నిరసనకారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్, వాటిటీ శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్, పరంజ్యోతి, గులాం ఖాదర్, కే. మాణిక్యం, జాత్రు నాయక్, నరసింహ, నాగన్న యాదవ్, బండారు కృష్ణ, షేక్ జహంగీర్, దేగ మహేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సత్తుపల్లిలో బీఆర్ఎస్ ఆందోళన.!

## కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ వైఖరికి తీవ్ర ప్రతిఘటన

**సత్తుపల్లి, సెప్టెంబర్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ మంగళవారం ఆందోళన కార్యక్రమం జరిగింది. అంబేద్కర్ విగ్రహం వద్ద బైఠాయించి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నినాదాలతో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

పీసీ గోస్ కమిటీ నివేదికను బహిరంగంగా ఖండించిన వారు, రాష్ట్రానికి ప్రాణాధారమైన కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ఆరోపణలు మోపడం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పెద్ద తప్పిదమని మండిపడ్డారు. వెంటనే ఆ నివేదికను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిరసనకారులు సీఎం డౌన్ డౌన్, కాంగ్రెస్ హఠావో - తెలంగాణ బచావో అంటూ ఘోషలతో మండల కేంద్రాన్ని మార్మోగించారు.

బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, కాళేశ్వరం కేవలం ఒక ప్రాజెక్టు కాదు, తెలంగాణ రైతు జీవనాధారం. దానిని రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ దెబ్బతీయడం రాష్ట్ర ప్రజల పట్ల అన్యాయం. తెలంగాణ ప్రజలు దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరని హెచ్చరించారు.


# వేము మోహన్ బాబు పార్థివ దేహానికి సండ్రా వెంకట వీరయ్య ఘన నివాళులు!





**సత్తుపల్లి, సెప్టెంబర్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన ప్రముఖ జర్నలిస్టు వేము మోహన్ బాబు పార్థివ దేహానికి మాజీ ఎమ్మెల్యే సండ్రా వెంకట వీరయ్య ఘనంగా నివాళులర్పించారు. పూలమాలలు సమర్పించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం మోహన్ సోదరుడు మాజీ ఎంపీటీసీ వేము కృష్ణను, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా స్థానిక టిఆర్ఎస్ మండల నాయకులు, యువజన నాయకులు, మోహన్ బాబుకు ఆత్మీయులు పాల్గొని నివాళులర్పించారు. మోహన్ బాబు జర్నలిజం రంగంలో చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ పలువురు ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు.





# మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం


## సింగపురం ఇమ్మానియేల్ రాజ్

**స్టేషన్‌ఘనపూర్, సెప్టెంబర్ 2 (తెలంగాణ ముచ్చట్లు):** మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సింగపురం ఇందిరా కుమారుడు, యువ నాయకుడు సింగపురం ఇమ్మానియేల్ రాజ్ అన్నారు. మంగళవారం రోజున ధర్మసాగర్ మండలం పెద్దాపేంద్యాల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దొంత పద్మ, గంటే కొమురయ్య, బత్తిని బలాలక్ష్మి కుటుంబాలను ఆయన పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదారుస్తూ "అధైర్యపడవద్దు... అన్నివిధాలా మీకు అండగా ఉంటాం" అని భరోసా ఇచ్చారు. అనంతరం మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు.

మాజీ అధ్యక్షుడి పరామర్శ

గ్రామ మాజీ అధ్యక్షుడు నేరెళ్ల రవి అనారోగ్యంతో ఉన్న విషయం తెలుసుకున్న ఇమ్మానియేల్ రాజ్, ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్యం గురించి ఆరా తీశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్లూరి మౌనిక, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ జీడి కొర్నెల్, నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రడపాక రాజ్‌కుమార్, ధర్మసాగర్ మండల కోఆర్డినేటర్ భిక్షపతి, చీల్పూరు దేవస్థానం మాజీ డైరెక్టర్ వికాస్‌రెడ్డి, మండల ఎంపీటీసీ మాజీ అధ్యక్షుడు సింగపురం దయాకర్, మండల మహిళా అధ్యక్షురాలు చింత జ్యోష్న, మండల ప్రధాన కార్యదర్శి నారాగోని పద్మ, నాయకులు తాటికొండ సంపత్, సరిత, సుమలత, యువ నాయకులు ప్రతిష్, ప్రశాంత్, సురేష్, కిషోర్, ప్రణయ్, వినయ్, నితీష్ తదితరులు పాల్గొన్నారు.





# వింగ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా వినాయక నిమజ్జనం

**కాప్రా, సెప్టెంబర్ 2 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గంలోని కాప్రా డివిజన్ వంపుగూడ కాలనీలో వింగ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వినాయక నవరాత్రి ఉత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ముగిశాయి. దాదాపు పది రోజుల పాటు ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సాగిన వేడుకలు నిమజ్జనంతో ముగియగా, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో గణనాధుని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా సంఘం పదవ వార్షికోత్సవం పురస్కరించుకొని ప్రత్యేకంగా భరతనాట్య ప్రదర్శన నిర్వహించారు. ప్రధాన అతిథిగా విచ్చేసిన ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం నగరి ప్రత్యేక పూజలు నిర్వహించి, భరతనాట్య నాట్యమయూరి లాస్యకు సత్కారం చేశారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పత్తి కుమార్, శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ కమిటీ సభ్యులు బిక్షపతి గౌడ్, నరసింహ గౌడ్, రాజు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొని వేడుక వైభవాన్ని మరింత పెంచారు. నిర్వాహకుల తరపున సతీశ్వర్ గౌడ్, వెంకటేష్, తరుణ్ యాదవ్, పవన్ గౌడ్, కార్తీక్ గౌడ్, గుణేష్ గౌడ్, మాధవ్ గౌడ్, బోస్, ఉపేందర్ గౌడ్, సతీష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ నర్సింగ్ తదితరులు అతిథులను ఘనంగా సత్కరించారు. కాలనీ వాసులు, యువతీ యువకులు విశేషంగా పాల్గొని నిమజ్జనోత్సవాన్ని విజయవంతం చేశారు.





# మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గణేష్ మండపాల సందర్శన

**మల్కాజ్గిరి, సెప్టెంబర్ 2 (తెలంగాణ ముచ్చట్లు):**


## నేరేడ్మెట్, గౌతమ్ నగర్, మౌలాలి డివిజన్లలో ప్రత్యేక పూజలు ఆర్థిక సహాయం అందజేత

మల్కాజ్గిరి నియోజకవర్గ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి నేరేడ్మెట్, గౌతమ్ నగర్, మౌలాలి డివిజన్లలో ఏర్పాటు చేసిన పలు గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. యువతలో ఉత్సాహం పెంపొందిస్తూ, మండపాలను ఏర్పాటు చేసిన సంఘాలకు ఆర్థిక సహాయం అందజేశారు. నేరేడ్మెట్ డివిజన్‌లో శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ ఆఫీసర్స్ కాలనీ ఆర్కేపురం, మహాదేవ యూత్ అసోసియేషన్ విజయనగర్, త్రినేత్ర యూత్ ఫ్రెండ్స్ అసోసియేషన్ మధురానగర్ మండపాలను సందర్శించారు. గౌతమ్ నగర్‌లో డైమండ్ యూత్ అసోసియేషన్ మల్లికార్జున్ నగర్ మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. మౌలాలి డివిజన్లో రుద్ర యువసేన అసోసియేషన్, బజరంగ్ యూత్ అసోసియేషన్, స్టార్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్, పిఎన్ఆర్ యూత్ అసోసియేషన్, బ్రదర్స్ యూత్ అసోసియేషన్, పీబీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, రాయల్ గణేష్ అసోసియేషన్, న్యూ వెంకటేశ్వర నగర్ కాలనీ అసోసియేషన్, జై భవాని యూత్ అసోసియేషన్, చందా బాగ్ యూత్ అసోసియేషన్, శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ, ఛత్రపతి యూత్ అసోసియేషన్, రెబల్ ఆర్గానిక్ యూత్, సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్, వీర గణపతి యూత్ అసోసియేషన్, వీర్సావర్కర్ యూత్ అసోసియేషన్, నవోదయ యూత్ అసోసియేషన్, త్రిశూల్ యూత్ అసోసియేషన్ వంటి మండపాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గణనాథుని ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని కోరుకున్నారు. సమాజ అభివృద్ధి అందరి సహకారంతో సాధ్యమవుతుందని, ప్రజల శ్రేయస్సు కోసం తాను నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేరేడ్మెట్, గౌతమ్ నగర్, మౌలాలి డివిజన్ల బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మండపాలు ఏర్పాటు చేసిన యువత సంఘాల సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

# ఓటర్ జాబితాలో తప్పులు లేకుండా సరిచూడాలి

## పెద్దమందడి తహసీల్దార్ సరస్వతి

**పెద్దమందడి,సెప్టెంబర్2(తెలంగాణ ముచ్చట్లు):** ఎన్నికలలో పారదర్శకత కోసం ఓటర్ జాబితా ఖచ్చితంగా సక్రమంగా ఉండాలని పెద్దమందడి తహసీల్దార్ సరస్వతి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బిఎల్వో లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ - "ఓటర్ జాబితాలో డబుల్ ఎంట్రీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటికే మరణించిన ఓటర్ల పేర్లు వెంటనే తొలగించాలి. కొత్తగా తయారవుతున్న జాబితాను మరోసారి పరిశీలించి తప్పులు ఉంటే వెంటనే సరిచేయాలి. లేనిపక్షంలో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు.

అలాగే - "ప్రతి గ్రామంలో బిఎల్వోలు ఓటర్ జాబితా పట్ల పూర్తి బాధ్యత వహించాలి. ప్రతి అర్హుడు తప్పక జాబితాలో ఉండేలా, అర్హత లేని వారు బయటకు వెళ్లేలా కృషి చేయాలి. అప్పుడే ఎన్నికలలో పారదర్శకత సాధ్యం అవుతుంది" అని సూచించారు.

ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్ గౌస్, రెవెన్యూ సిబ్బంది, మండలంలోని వివిధ గ్రామాల బిఎల్వోలు పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్రపూరిత రాజకీయాలకు నిరసన

**పెద్దమండడి మండలంలో బిఆర్ఎస్ ధర్నా**

**పెద్దమండడి,సెప్టెంబర్2(తెలంగాణ ముచ్చట్లు):** కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారానికి నిరసనగా బిఆర్ఎస్ శ్రేణులు పెద్దమండడి మండల కేంద్రంలో రచ్చకట్ట వద్ద ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి, మండల అధ్యక్షుడు వేణు యాదవ్ మాట్లాడుతూ -
తెలంగాణ రైతులకు నీళ్లు ఇవ్వడం పాపమని కాంగ్రెస్ భావిస్తోంది.
నీళ్లు ఇచ్చిన కేసీఆర్ పై నిందలు మోపడం



కాంగ్రెస్ దుష్టచర్యలలో భాగం. అని వ్యాఖ్యానించారు.

నాయకులు ఆరోపిస్తూ – "ఐదున్నర దశాబ్దాలు కాంగ్రెస్ పాలనలో ఒక్క ప్రాజెక్టు కూడా కట్టకుండా, రైతాంగాన్ని బాంబే-దుబాయ్ వలసలు వెళ్ళేటట్లు చేసింది. కానీ తెలంగాణ వచ్చాక కేసీఆర్ నేతృత్వంలో సాగునీరు లభించి పచ్చగా విరబూసిన పంటలు పండుతున్నాయి. అలాంటి ప్రాజెక్టులపై కాంగ్రెస్ నేతలు కళ్లల్లో విషం నింపుకొని కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నారు" అని అన్నారు.
ధర్నాలో మాజీ గొర్లకాపర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగేంద్ర యాదవ్, వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సెప్టెంబర్ 4న కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నాకు ఏఎన్ఎంల సిద్ధం!

**సీఐటీయూ ఆధ్వర్యంలో వైద్యాధికారికి వినతిపత్రం**

**సత్తుపల్లి, సెప్టెంబర్ 02 (తెలంగాణ ముచ్చట్లు ):** వేంసూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఇందుప్రియాంకకు సీఐటీయూ అనుబంధ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు వినతిపత్రం సమర్పించారు. సెప్టెంబర్ 4న హైదరాబాదులోని కోఠి కమిషనర్ కార్యాలయం ఎదుట జరగబోయే ధర్నాలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు జాల కొండలరావు, కార్యదర్శి బండారు వేణుగోపాల్ మాట్లాడుతూ...
ప్రస్తుతం వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న రెగ్యులర్ ఏఎన్ఎంలు, రెండవ ఏఎన్ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్స్ ఏఎన్ఎంలు, ఈసి ఏఎన్ఎంలు, హెచ్ఆర్డి ఏఎన్ఎంలు తదితరులు తీవ్ర సమస్యలతో బాధపడుతున్నారని వివరించారు. పని ఒత్తిడి ఎక్కువగా ఉండడమే కాకుండా, ఏకకాలంలో అనేక టార్గెట్లను విధించారని, వాటిని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో తప్పనిసరిగా పూర్తిచేయాలని రాష్ట్ర అధికారులు బలవంతం చేస్తున్నారని ఆరోపించారు. వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రతి వారం కొత్త టార్గెట్లతో మానసిక వేధింపులకు గురి చేస్తున్నారని వేదన వ్యక్తం చేశారు.
దీని కారణంగా ఏఎన్ఎంలు అనారోగ్యం పాలవుతూనే విధులు నిర్వర్తించాల్సి వస్తోందని, పైగా ఉద్యోగులకు రావలసిన హక్కులు మాత్రం లభించడం లేదని అన్నారు. పెండింగ్ బిల్లులు, స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం వంటి అంశాలు ఇంకా పరిష్కారంలోకి రాకపోవడాన్ని తీవ్రంగా విమర్శించారు.
ఈ నేపథ్యంలో 2025 సెప్టెంబర్ 4, గురువారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ కోఠి కమిషనర్ కార్యాలయం ఎదుట ఏఎన్ఎంల ధర్నా జరుగుతుందని ప్రకటించారు. అందరు ఏఎన్ఎంలు, ఇతర ఉద్యోగులు తప్పనిసరిగా హాజరుకావాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మల్లూరు చంద్రశేఖర్, వీరయ్య, ఎం. కృష్ణవేణి, వి.కృష్ణవేణి, సుమలత, శబనం, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ఐ ఫోన్ యూజర్లకు కేంద్రం వార్నింగ్

ఐఫోన్, మ్యాక్ యూజర్లకు కేంద్రం వార్నింగ్ ఇచ్చింది. వినియోగదారుల డేటా దొంగలించేందుకు సెక్యూరిటిని దాటవేయగల శక్తివంతమైన స్పైవేర్‌ను సైబర్ నేరగాళ్లు ఫోన్‌లలో ప్రవేశపెడుతున్నట్టు హెచ్చరించింది. దేశంలోని, ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది ఫోన్లకు స్పైవేర్ ముప్పు పొంచి ఉందని తెలిపింది. ఈ మేరకు ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం జజుRuIఅ హెచ్చరించింది. ఏ విధంగా యూజర్లు స్పైవేర్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటారో వివరాలు వెల్లడిరచింది. స్పైవేర్ దాడులను ఆపడం కూడా కష్టమని పేర్కొంది. యూజర్లకు యూఆర్ఎల్ లింక్స్ పంపి సమాచారాన్ని దొంగలిస్తారని హెచ్చరించింది. మాల్వేర్ మాదిరికాకుండా స్పైవేర్‌లకు లింక్ పై క్లిక్చేయడం లేదా వాటిని ఫోన్‌లోకి అనుమతించడం ద్వారా ఫోన్ హ్యాక్ అవుతుందని తెలిపింది. పెగాసస్ లాంటి స్పైవేర్ సైబర్ ఎటాక్స్‌కు అడ్డాగా మారాయన్నారు. ప్రతి రోజు బిలియన్స్ మంది ఉపయోగించే వాట్సాప్ లాంటి ప్లాట్ ఫామ్స్ ద్వారా సందేశాలు, చిత్రాలు పంపడం, లేదా వీడియో కాల్స్ చేయడం లాంటివి సైబర్ నేరగాళ్లు చేస్తూ హ్యాకింగ్ కు పాల్పడుతున్నారని పేర్కొంది. స్పైవేర్ ప్రమాదాన్ని ఎక్కువగా ఎదుర్కొంటున్న ఐఓఎస్ డివైజ్‌లలో 2.25.21.73 కి ముందున్న వర్షన్ డివైజ్‌లు ఉన్నాయని తెలిపింది. అంతే కాకుండా ఐఓఎస్ వాట్సాప్ బిజినెస్ వర్షన్ 2.25.21.78, మ్యాక్ వాట్సాప్ వర్షెన్ 2.25.21.78లకు హ్యాకింగ్ ప్రమాదం ఉందని పేర్కొంది.

# బీఎస్ఎన్ఎల్ యూజర్లకు గుడ్‌న్యూస్.. ఆ ప్లాన్ మరో 15 రోజులు పొడిగింపు




ప్రభుత్వ రంగ టెలీకాం సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ తన యూజర్లకు గుడ్ న్యూస్ చెప్పింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టునెలలో ఒక్క రూపాయికే అపరిమిత సేవలను అందిస్తూ.. స్పెషల్ ఆఫర్ తీసుకువచ్చింది. ఆగస్టు 1 నుంచి 31 వరకూ మాత్రమే ఈ ప్లాన్ అందుబాటులో ఉంటుందని ప్రకటించిన బీఎస్ఎన్ఎల్.. తాజాగా ఆ గడువును పొడిగించింది. ఆజాదీ కా ప్లాన్ పేరుతో తీసుకువచ్చిన ఈ ఆఫర్ ను సెప్టెంబర్ 15వ తేదీ వరకూ అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపింది. ఈ ప్లాన్ కింద రీఛార్జ్ చేసుకుంటే.. ఒక్క రూపాయికే నెలరోజులపాటు అన్ లిమిటెడ్ వాయిస్ కాల్స్, ప్రతిరోజూ 2 జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్ లు లభిస్తాయి. అంతేకాదు.. 4జీబీ సిమ్ ను కూడా ఫ్రీగా అందిస్తోంది బీఎస్ఎన్ఎల్. వినియోగదారుల్ని పెంచుకోవడమే లక్ష్యంగా ఎప్పటికప్పుడే కొత్త ప్లాన్స్ తీసుకొస్తోంది బీఎస్ఎన్ఎల్. మిగతా నెట్వర్క్ లలో ఇవన్నీ ఉండే ప్లాన్స్ సుమారు రూ.300 నుంచి ప్రారంభమై రూ.390 వరకూ ఉన్నాయి. బీఎస్ఎన్ఎల్ ఆజాదీ కా ప్లాన్‌ను పొడిగించడంతో యూజర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. రూ.1కే ఈ సేవల్ని పొందాలంటే యూజర్లు సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్ లేదా అధికారిక రిటైలర్ ను సంప్రదించాల్సి ఉంటుంది.




# ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు!

**సత్తుపల్లిలో కేక్ కటింగ్, బాణాసంచా, బైక్ ర్యాలీ. అన్నదానంతో సంబరాలు.**

**సత్తుపల్లి, సెప్టెంబర్ 02 (తెలంగాణ ముచ్చట్లు):** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొనిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు మంగళవారం సత్తుపల్లి పట్టణంలో ఉత్సాహంగా జరిగాయి. మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో కాపు యువత వంగవీటి మోహనరంగా విగ్రహం వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు.
ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్‌చైర్పర్సన్ తోట సుజలరాణి ముఖ్య అతిథిగా హాజరై పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేశారు. అనంతరం జనసేన పార్టీ ఆధ్వర్యంలో పట్టణ బస్టాండ్ సెంటర్ వద్ద మరొకసారి కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి సంబరాలు జరిపారు.
అదనంగా బైక్ ర్యాలీ నిర్వహించి, పేదలకు, యాచకులకు అన్నదానం చేయడం విశేషం. పట్టణమంతా పండుగ వాతావరణాన్ని తలపించేలా వేడుకలు ఉత్సాహంగా కొనసాగాయి. ఈ సందర్భంగా మున్నూరు కాపు యువ నాయకులు తోట కిరణ్, తోట బబ్లూ, కల్నేని సాయి, మానుకోట జీవన్, గాదె నాగు, బత్తుల పవన్, చంటి, మణికంఠ, మానుకోట ప్రసాద్, సుంకర వాసు, తోట నాని, రాజేష్, నరేష్, మురళి తదితరులు పాల్గొన్నారు. అలాగే జనసేన పార్టీ నాయకులు ఆళ్ళ నరేష్, మిరియాల శివాజీ, శెట్టి సాయి, కొమ్మగిరి శరత్ అప్పారావు తదితరులు పాల్గొని వేడుకలను మరింత ఉత్సాహభరితంగా జరిగాయి.

# త్వరలో అందుబాటులోకి రానున్న ఆన్‌లైన్ గేమింగ్ చట్టం

ప్రభుత్వం ఆన్‌లైన్ గేమింగ్ చట్టం అతి త్వరలో అందుబాటులోకి వస్తుందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ కార్యదర్శి ఎస్ కృష్ణన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 21న ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ చట్టం 2025ని పార్లమెంటు ఆమోదించిన సంగతి తెలిసిందే. ఈ చట్టం ఈస్పోర్ట్స్, ఇతర ఆన్‌లైన్ గేమ్‌లను ప్రోత్సహిస్తూనే అన్ని రకాల ఆన్‌లైన్ మనీ గేమ్‌లను నిషేధిస్తుంది. ఇప్పటికే దీనికి రాష్ట్రపతి ఆమోదం కూడా లభించింది. ప్రభుత్వం నోటిఫై చేసిన తర్వాత ఈ చట్టం అమల్లోకి వస్తుంది. అనుకున్న సమయం కంటే చాలా త్వరగా ఈ చట్టం అమలులోకి వస్తుంది. అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎస్ కృష్ణన్ సెమీకండక్టర్లపై జరిగిన



ఐసీఈఏ ఈవెంట్ సందర్భంగా అన్నారు. గత వారం ఆర్థిక సేవల శాఖ, ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖతో బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు జరిపిన సంయుక్త సమావేశంలో బిల్లు నిబంధనను అమలు చేయడానికి వివరణాత్మక మార్గదర్శకాలను, ఆన్‌లైన్ మనీ గేమ్‌ల కోసం లావాదేవీలను సమీక్ష నిర్వహించే వ్యవస్థను ఏర్పాటు చేయడానికి సమయాన్ని కోరాయి. ఈ చట్టం ఆన్‌లైన్ మనీ గేమ్‌లకు సంబంధించిన ప్రకటనలను, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు అటువంటి గేమ్‌లలో నిధులను బదిలీ చేయకుండా నిషేధిస్తుంది. అందుకే బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఆర్థిక పరమైన లావాదేవీల తనిఖీలకు సమయం కోరాయి. ఆన్‌లైన్ మనీ గేమ్స్ గురించి యాడ్స్ వేస్తే 2 ఏళ్ల జైలుశిక్ష, రూ. 50 లక్షల జరిమానా విధించనున్నారు. అంతేకాకుండా ఆన్‌లైన్ మనీ గేమ్స్‌కు ఆర్థిక సహకారం అందించే వారికి 3 ఏళ్ల జైలుశిక్ష, రూ. కోటి వరకు జరిమానా విధిస్తారు. పదే పదే చట్టాన్ని ఉల్లంఘిస్తే 35 ఏళ్ల జైలు శిక్ష, రూ. 2 కోట్ల జరిమానా విధించనున్నారు.

# రూ. 1.05 లక్షల మార్కు దాటిన బంగారం



బంగారం ధరలు హద్దుల్లేకుండా దూసుకెళ్తున్నాయి. ఇప్పటికే భారీగా పెరిగిన ధరలను చూసి సామాన్యులు కొనేందుకు దూరమవుతుండగా, తాజాగా పసిడి ధరలు సరికొత్త రికార్డు గరిష్టాలకు చేరాయి.వరుసగా ఆరో రోజు బంగారం రూ. 1,000 పెరగడంతో దేశ రాజధానిలో సోమవారం పది గ్రాములు రూ. 1,05,670 వద్ద కొత్త గరిష్ఠాలను తాకింది. ఇందుకు ప్రధానంగా అమెరికా ఫెడ్ రేట్లను తగ్గిస్తుందనే అంచనాలు, గ్లోబల్ మార్కెట్లలో డిమాండ్ పెరగడంతో ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం హైదరాబాద్ మార్కెట్లో 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం సోమవారం రూ.930 పెరిగి 10 గ్రాములకు రూ.1,05,880 (అన్ని పన్నులు కలిపి) జీవితకాల గరిష్ట స్థాయికి చేరుకుంది. ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల పసిడి రూ. 850 పెరిగి రూ. 97,050 వద్దకు చేరింది. యూఎస్ ఫెడ్ వ్యవహారంలో పెరుగుతున్న ఆందోళనలు, టారిఫ్ విధానాలపై పెరిగిన అనిశ్చితి మధ్య పెట్టుబడిదారులు సురక్షితమైన ఆస్తుల వైపు మొగ్గు చూపడంతో ధరలు అత్యధికంగా పెరుగుతున్నాయని వ్యాపారులు తెలిపారు. మరోవైపు వెండి ధరలు కూడా రూ. 1,000 పెరిగి కిలోగ్రాముకు రూ. 1,36,000 (అన్ని పన్నులు కలిపి) కొత్త గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్‌లో డిమాండ్ కారణంగా దేశీయ మార్కెట్లలో వెండి రికార్డు స్థాయిలో పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో స్పాట్ గోల్డ్ ఔన్సుకు 3,470.51 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# నిబంధనల ప్రకారమే రష్యా చమురు కొనుగోళ్లు

రష్యా చమురు, ఇంధన వాణిజ్యాన్ని కొనుగోలు చేయడంలో భారత్ ఎటువంటి నియమాలను ఉల్లంఘించలేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి స్పష్టం చేశారు. సోమవారం ఓ జాతీయ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. భారత ప్రభుత్వం అంతర్జాతీయ నిబంధనలను గౌరవించడంతోనే గ్లోబల్ మార్కెట్లలో చమురు ధరలు పెరగకుండా స్థిరంగా ఉన్నాయి. ఈ సందర్భంగా వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో రష్యా చమురుకు భారత్ 'లాండ్రోమ్యాట్'గా మారిందన్న వ్యాఖలను కేంద్ర మంత్రి తోసిపుచ్చారు. ఆయన వ్యాఖ్యలు వాస్తవానికి ఏ మాత్రం పొంతనలేదని తెలిపారు. అంతేకాకుండా రష్యా చమురును కొనుగోలు చేసి భారత్ లాభపడిరదనే వ్యాఖ్యలనూ ఆయన తిప్పికొట్టారు. 2022లో రష్యా ఉక్రెయిన్‌పై దాడి చేయడానికి చాలా కాలం ముందు నుంచే భారత్ అతిపెద్ద పెట్రోలియం ఉత్పత్తులను ఎగుమతి చేసే దేశంగా ఉందని, ఎగుమతుల పరిమాణం, మార్జిన్‌లు అంతే ఉన్నాయని అన్నారు. కొంతమంది విమర్శకులు భారత్ రష్యా చమురు కోసం 'లాండ్రోమాట్'గా మారిందని ఆరోపిస్తున్నారు. అందులో ఏ మాత్రం నిజం లేదనిని పేర్కొన్నారు. రష్యా నుంచి కొనే చమురు ధరలు జీ7 దేశాలు విధించే ప్రైస్ క్యాప్‌కు అనుకూలంగా ఉన్నాయి.ఈ ప్రైస్ క్యాప్ జీ7 దేశాలు రష్యా ఆదాయాన్ని నియంత్రించడం కోసం తెచ్చిందనే విషయాన్ని గుర్తించుకోవాలి. ప్రపంచ చమురు ధరలను స్థిరంగా ఉండటంలో కీలక యంత్రాంగంగా భారత్ పని చేస్తోందని మంత్రి వెల్లడిరచారు. కాగా, ఇటీవల పీటర్ నవారో మాట్లాడుతూ, భారత్ లాండ్రోమ్యాట్‌గా ఉండటం మూలంగా ఓ వర్గం లాభపడుతోంది. అందుకు భారత్ తన ప్రజలను పణంగా పెడుతోందని, దాన్ని అడ్డుకోవాలన్నారు. ఉక్రెయిన్ ప్రజలను బలి తీసుకుంటున్న ఈ ధోరణి, అమెరికనలు చెల్లింపుదారులుగా ఏం చేయాలనేది చూడాలన్నారు. భారత్ లాంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి అధినేత నరేంద్ర మోడీ పుతిన్, జిన్పింగ్‌లతో ఎందుకని అంటకాగుతున్నారో అర్థం కావట్లేదని అన్నారు. ఈ క్రమంలోనే హర్దీప్ సింగ్ తాజా వ్యాఖ్యలు చేశారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# లండన్‌లో రోడ్డు ప్రమాదం.. హైదరాబాద్ వాసుల దుర్మరణం

లండన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు హైదరాబాద్ వాసులు మృతి చెందారు. వినాయక నిమజ్జనానికి వెళ్లి వస్తుండగా రెండు కార్లు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతులను నాదర్‌గుల్‌కు చెందిన తర్రె చైతన్య (23), ఉప్పల్‌కు చెందిన రిషితేజ (21)గా గుర్తించారు. ఈ ఘటనలో మరో ఐదుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులు అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. బాధితులంతా తెలుగు రాష్ట్రాలకు చెందినవారిగా గుర్తించారు. నాదర్‌గుల్‌కు చెందిన తర్రె ఐలయ్య, మంగమ్మల చిన్న కుమారుడు చైతన్య. బీటెక్ పూర్తిచేసిన ఆయన.. ఉన్నత చదువుల కోసం 8 నెలల క్రితం లండన్ వెళ్లాడు. వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుని 8 మంది స్నేహితులతో రెండు కార్లలో నిమజ్జనానికి బయల్దేరారు. తిరిగి వస్తున్న సమయంలో వీరి కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చైతన్య, రిషితేజ మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి సోమవారం రాత్రి కుటుంబసభ్యులకు సమాచారం అందింది. వీరి మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.



## యూఎస్ ప్రెసిడెంట్‌పై పుతిన్ విమర్శలు

అమెరికా విచక్షణారహిత ఆర్థిక ఆంక్షలు, అదనపు సుంకాలు విధిస్తుందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పరోక్షంగా ట్రంప్‌ని విమర్శించారు. రష్యాచైనా సంబంధాలు చాలా బలంగా ఉన్నాయని, ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి రెండు దేశాలు బ్రిక్స్ సమూహాన్ని బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నాయని పుతిన్ అన్నారు. చైనాలోని టియాంజిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) శిఖరాగ్ర సమావేశానికి హాజరైన ఆయన చైనా మీడియాతో మాట్లాడారు. ఆర్థిక వ్యవస్థలను నూతన వలసవాద సాధనాలుగా మార్చడం ఆపాలని అమెరికా పేరు చెప్పకుండా విమర్శించారు. భారతదేశంతో సహా అనేక దేశాలపై అదనపు సుంకాలు, ఆర్థిక ఆంక్షల గురించి ట్రంప్ బెదిరింపులను పుతిన్ ప్రస్తావించారు. మనం మొత్తం మానవాళి ప్రయోజనం కోసం పనిచేయాలని, ''వివక్షతో ఆంక్షలు'' సామాజికఆర్థిక అభివృద్ధికి ఆటంకం కలిగిస్తాయని పేర్కొన్నారు. బ్రిక్స్ సమూహం ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి, ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రతపై సాధారణ అభిప్రాయాలను పంచుకునే సామర్థ్యాన్ని బలోపేతం చేస్తుందని వెల్లడిరచారు. సభ్య దేశాలు ప్రపంచం యొక్క సామాజికఆర్థిక అభివృద్ధికి ఆటంకం కలిగించే వివక్షత ఆంక్షలకు వ్యతిరేకంగా వైఖరి తీసుకోవాలని కోరారు.

## భారత్ పై అక్కసు వెళ్లగక్కిన ట్రంప్




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ భారత్‌పై ఘాటు విమర్శలు చేశారు. వాణిజ్య సంబంధాలు పూర్తిగా అసమానంగా మారాయని, ఇది ఏకపక్ష విపత్తు'గా ఉందని ఆయన అన్నారు. భారత్ విధిస్తున్న అధిక సుంకాలు అమెరికా కంపెనీలకు పెద్ద అడ్డంకిగా మారాయని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో ఈ వ్యాఖ్యలు చేశారు. దశాబ్దాలుగా భారత్ అమెరికాకు భారీగా సరుకులు అమ్ముతున్నా, అమెరికా నుంచి దిగుమతులు తక్కువగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఇది పూర్తిగా ఒకవైపు వాణిజ్యం అని స్పష్టంగా పేర్కొన్నారు.ప్రపంచంలోనే అత్యధిక సుంకాలను భారత్ విధిస్తోందని ట్రంప్ విమర్శించారు. ఈ పరిస్థితుల్లో అమెరికా కంపెనీలు భారత మార్కెట్‌లో నిలబడలేకపోతున్నాయని అన్నారు. భారత్‌లో వ్యాపారం చేయడం చాలా కష్టతరమైందని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికాను పక్కన పెట్టి భారత్ రష్యా నుంచి చమురు, ఆయుధాలు కొనుగోలు చేయడంపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా నుంచి కాకుండా రష్యా నుంచి అవసరాలు తీర్చుకోవడం సరైంది కాదు అని ఆయన అన్నారు. ఈ నిర్ణయాల వల్ల వాణిజ్య సంబంధాలు మరింత దెబ్బతింటాయని హెచ్చరించారు.భారత్ ఇప్పుడు సుంకాలను తగ్గించడానికి సిద్ధమైందని ట్రంప్ పేర్కొన్నారు. అయితే ఈ నిర్ణయం చాలా ఆలస్యమైందని ఆయన వ్యాఖ్యానించారు. ఇది ఏళ్ల క్రితమే జరగాలి. ఇప్పుడు దాని ప్రయోజనం తక్కువ అని అన్నారు. చైనాలో జరిగిన ఎస్‌సీవో సదస్సులో మోదీ, పుతిన్, జిన్‌పింగ్ భేటీ అనంతరం ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రత్యేక ఆసక్తి రేపింది. భారత్‌రష్యా సన్నిహిత సంబంధాలు అమెరికాకు ఇష్టం లేకపోవడం స్పష్టమైంది.ట్రంప్ విమర్శలకు కొన్ని రోజుల ముందే అమెరికా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. భారత ఉత్పత్తులపై 50 శాతం సుంకాన్ని విధించింది. దీనికి కారణంగా భారత్ రష్యా నుంచి భారీగా చమురు దిగుమతి చేసుకోవడమే అని స్పష్టంచేసింది.ట్రంప్ విమర్శలు, కొత్త సుంకాలు భారత్‌అమెరికా వాణిజ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. రెండు దేశాల మధ్య సంబంధాలు సున్నిత దశలోకి వెళ్లాయని విశ్లేషకులు చెబుతున్నారు. భవిష్యత్తులో ఈ వివాదం ఎలా పరిష్కారం అవుతుందో చూడాలి.

# ఈసీ, రాజకీయ పార్టీల మధ్య విభేదాలు.. బాధాకరం అన్న సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** ఇటీవల ఈసీకి రాజకీయ పార్టీల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఒకరిపై ఒకరు ఆరోపణల వర్షం కురుస్తూనే ఉంది.ఈ పోకడలపై సుప్రీంకోర్టు కూడా కీలకవ్యాఖ్యలు చేసింది. కేంద్రప్రభుత్వంతో ఈసీ కుమ్మక్కై ఓటర్లను తారుమారుచేస్తూ ఓటు కుంభకోణానికి పాల్పడుతున్నదని ఇండియా కూటమి ఆరోపిస్తున్నది. దీంతో బీహార్ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల కోసం నామినేషన్ల దాఖలుకు చివరితేదీ వరకు అవకాశం ఉంటుందని ఎన్నిక సంఘం (ఈసీ) కోర్టుకు స్పష్టం చేసింది. దీంతో సెప్టెంబర్ 1తోముగిసిన గడువుపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తేలిపోయింది. బీహార్లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్నికల సంఘం ఆగస్టు 1న ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేసింది. దీనిపై అభ్యంతరాలు తెలిపేందుకు సెప్టెంబర్ 1ని తుది గడువుగా నిర్ణయించింది. ఈ గడువును పొడిగించాలని కోరుతూ కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్పైసోమవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం తన వైఖరిని తెలియజేసింది. అభ్యంతరాలను సెప్టెంబర్ 30 తర్వాత కూడా స్వీకరిస్తామని, నామినేషన్ల ప్రక్రియ ముగిసేంత వరకు సవరణలు కొనసాగుతాయని సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది.

## వివాదాస్పదం అవుతున్న పీటర్ నవర్రో వ్యాఖ్యలు



అమెరికా శ్వేతసౌధం వాణిజ్య సలహాదారుడు పీటర్ నవర్రో చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఇండియా దిగుమతులపై 50 శాతం సుంకాన్ని విధిస్తున్న అంశంపై మాట్లాడుతూ బ్రహ్మణులు లాభపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత ప్రజలను వాడుకుని బ్రహ్మణులు లాభపడుతున్నారని, దీన్ని ఆపాలని ఆయన అన్నారు. రష్యాకు లాండ్రీగా ఇండియా మారినట్లు ఆయన ఆరోపించారు. అమెరికాకు పోటీగా వాణిజ్య అసమానతలను ఇండియా సృష్టిస్తున్నట్లు పీటర్ నవర్రో పేర్కొన్నారు. రష్యా నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేయడం వల్లే ఇండియాపై 50 శాతం టారిఫ్ వసూల్ చేస్తున్నట్లుపీటర్ నవర్రో పేర్కొన్నారు. తాజాగా ఆయన ఓ ఇంటర్వ్యూలో ప్రాఫిటీరింగ్ బ్రహ్మిన్స్ అనే పదాన్ని వాడడం చర్చనీయాంశమైంది. ఆ పదం వాడుకపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. రాజకీయ పార్టీలు భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. శ్వేతసౌధం వాణిజ్య సలహాదారు పీటర్ చేసిన వ్యాఖ్యలను శివసేన ఉద్దవ్ పార్టీ నేత ప్రియాంకా చతుర్వేది తప్పుపట్టారు. అమెరికా నేత మరీ దిగజారిపోయే తికమక స్థితిలో మాట్లాడుతున్నట్లు ఆరోపించారు. తన ఎక్స్ పోస్టులో ఆమె కామెంట్ చేశారు. తన ఉద్దేశాన్ని వ్యక్తం చేయడానికి నవర్రో.. భారత్‌లోని ఓ కులాన్ని ఐడెంటిటీగా చూపించడం సరికాదు అని ఆమె అన్నారు. ఇది చాలా సిగ్గుమాలిన వ్యాఖ్య అన్నారు. అమెరికాలోని బోస్టన్‌లో ఉన్న సంపన్నులను బ్రహ్మణులని అంటారని, వారిని బోస్టన్ బ్రాహ్మిణ్ అని పిలుస్తారేమో, కానీ భారతీయ దృక్పథంలో ఓ అమెరికా నేత మాట్లాడడం సరికాదు అని ఆమె పేర్కొన్నారు. బ్రహ్మణులు లాభపడుతున్నట్లు చేసిన వ్యాఖ్యలను సంపూర్ణంగా వివరించాలన్నారు.తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నేత సాగరికా ఘోష్ కూడా తన ఎక్స్ పోస్టులో రియాక్ట్ అయ్యారు.

## ప్రధాని మోదీపై ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు




**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మోదీ ఓట్ల చోరీ చేయాలనే కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని ముట్టడిరచేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. బీహార్‌లో విపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఓటర్ అధికార్ యాత్ర' ముగింపు సభలో ఖర్గే ప్రసంగించారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ, 'ప్రధాని మోదీ కి చోరీ చేయడం ఒక అలవాటుగా మారింది. ఓట్లను, ప్రజాధనాన్ని దోచుకోవడంలో ఆయనకు అనుభవం ఉంది' అని విమర్శించారు. ఖర్గే మాట్లాడుతూ, మోదీతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా ప్రజలను అణచివేయాలనే యత్నంలో ఉన్నారని ఆరోపించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండకపోతే, బీహార్‌లో ప్రజాస్వామ్య బలహీనపడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎన్డీఏ ఆధ్వర్యంలోని డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఎక్కువ రోజులు అధికారంలో ఉండదని ఖర్గే ధీమా వ్యక్తం చేశారు. త్వరలో ఏర్పడబోయే ప్రభుత్వం ప్రజలకు అనుకూలంగా, ముఖ్యంగా పేదలు, మహిళలు, దళితులు, వెనుకబడిన తరగతులకు మేలు చేసేలా ఉంటుందని చెప్పారు. 'ఓటర్ అధికార్ యాత్ర'ను అడ్డుకోవడానికి అనేక ప్రయత్నాలు జరిగినప్పటికీ, బీహార్ ప్రజలు వెనక్కి తగ్గలేదని ఖర్గే ప్రశంసించారు. ప్రజల మద్దతుతో యాత్ర విజయవంతమైందని పేర్కొన్నారు. ఇది ప్రజల చైతన్యానికి నిదర్శనమని అభిప్రాయపడ్డారు.

## బిహార్‌లో రేషన్ డీలర్ల నిరసనపై లాఠీచార్జి ఖండన



**పాట్నా:** బిహార్ రాష్ట్రంలో రేషన్ డీలర్లు తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన చేపట్టారు. అయితే వారి శాంతియుత నిరసనపై పోలీసులు లాఠీచార్జి చేశారు. అంతేకాక వాటర్ కేనన్లను కూడా వినియోగించారు. ఈ ఘటన డీలర్లలో ఆగ్రహం రేపింది.ఈ సంఘటనపై రేషన్ డీలర్ల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ ఉపాధ్యక్షుడు దివి లీలా మాధవరావు తీవ్రంగా స్పందించారు. సోమవారం ఒక ప్రకటనలో ఆయన ఈ చర్యలను దారుణమని అభివర్ణించారు. శాంతియుతంగా డీలర్లు తమ హక్కుల కోసం నిలబడ్డారని గుర్తు చేశారు. అలాంటి వారి మీద బలవంతం చేయడం అంగీకార యోగ్యం కాదని అన్నారు. డీలర్ల సమస్యలను అర్థం చేసుకొని పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని లీలా మాధవరావు స్పష్టం చేశారు. సమస్యలతో బాధపడుతున్న డీలర్లను అణచివేయడం తప్పు అని పేర్కొన్నారు. వారి డిమాండ్లు వినిపించకుండా అణచివేత పాలన న్యాయం కాదని అన్నారు.బిహార్‌లో రేషన్ డీలర్లు చాలాకాలంగా సమస్యలు ఎదుర్కొంటున్నారు. నిత్యావసర సరుకుల సరఫరాలో ఆలస్యం జరుగుతుందని అంటున్నారు. అదనంగా వారికి ఇచ్చే కమీషన్ చాలా తక్కువగా ఉందని ఫిర్యాదు చేస్తున్నారు. డీలర్ల ఖర్చులు పెరుగుతున్నా, ఆదాయం తక్కువగా ఉండటంతో జీవనోపాధి కష్టమైందని చెబుతున్నారు. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడంతో వారు నిరసనకు దిగారు. కానీ ఆ నిరసనను అణచివేయడానికి పోలీసులు బలప్రయోగం చేశారు. లాఠీచార్జి, వాటర్ కేనన్ల వినియోగం ప్రజాస్వామ్యంలో అంగీకరించలేని చర్య అని పౌర సమాజం కూడా విమర్శిస్తోంది .ఈ సమస్యను కేవలం బిహార్ ప్రభుత్వం మాత్రమే కాదు, కేంద్ర ప్రభుత్వం కూడా గమనించాలని రేషన్ డీలర్ల సమాఖ్య డిమాండ్ చేసింది. దేశవ్యాప్తంగా డీలర్ల సమస్యలు ఒకే విధంగా ఉన్నాయని గుర్తు చేశారు. వాటికి ఒక సమగ్ర పరిష్కారం అవసరమని తెలిపారు.

## యూఏఈతో చమురేతర వాణిజ్యంపై కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ:** భారత్, యూఏఈ లు తమ ఆర్థిక సంబంధాలను మరింత బలపరిచే దిశగా కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఇరు దేశాల మధ్య ఉన్న సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సెపా)ను సమీక్షించిన తర్వాత, 2030 నాటికి చమురేతర ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 100 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. మారుతున్న గ్లోబల్ వాణిజ్య పరిస్థితుల్లో ఈ నిర్ణయం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. గత వారం ఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ మరియు యూఏఈ విదేశీ వాణిజ్య మంత్రి థానీ బిన్ అహ్మద్ అల్ జెయౌదీ మధ్య ఉన్నతస్థాయి చర్చలు జరిగాయి. ఈ సమావేశ వివరాలను కేంద్ర ప్రభుత్వం అధికారిక ప్రకటనలో వెల్లడిరచింది.ఇద్దరు మంత్రులు ఇప్పటివరకు 'సెపా' ఒప్పందం కింద సాధించిన పురోగతిని సమీక్షించారు. భవిష్యత్తులో పునరుత్పాదక ఇంధనం, డిజిటల్ మౌలిక వసతులు, ఆరోగ్య సంరక్షణ, సరఫరా గొలుసు వంటి రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించారు. వాణిజ్యాన్ని సులభతరం చేయడానికి రూపాయిదిర్హామ్ సెటిల్‌మెంట్ సిస్టమ్ కీలక పాత్ర పోషిస్తుందని మంత్రులు అభిప్రాయపడ్డారు. అలాగే, యూఏఈలో 'భారత్ మార్ట్' ఏర్పాటుతో భారత ఉత్పత్తులకు మరింత ప్రాధాన్యం దక్కుతుందని భావిస్తున్నారు.వాణిజ్య సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచుకోవడం ద్వారా సెపా పర్యవేక్షణ మరింత బలపడుతుందని నిర్ణయించారు.భారత ఫార్మా కంపెనీలు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా ఈ సమావేశంలో ప్రత్యేక చర్చ జరిగింది. యూఏఈలో కొత్తగా ఏర్పాటు చేసిన ఎమిరేట్స్ డ్రగ్ ఎస్టాబ్లిష్‌మెంట్ వాటి పరిష్కారంలో కీలకంగా మారుతుందని భారత్ ఆశాభావం వ్యక్తం చేసింది.ఫార్మా ఉత్పత్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తామని యూఏఈ మంత్రి హామీ ఇచ్చారు. అలాగే, ఆయుర్వేదం మరియు సంప్రదాయ వైద్య రంగాల్లో కూడా ఇరు దేశాల సహకారానికి అవకాశాలున్నాయని చర్చించారు.



## బీజేపీపై విరుసుకపడ్డ సిద్ధరామయ్య

**బెంగళూరు:** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. హిందువుగా ఉండటం అంటే రాజకీయాలు చేయడం లేదా అబద్ధాలు ప్రచారం చేయడం కాదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రపంచ ప్రఖ్యాత మైసూరు దసరా ఉత్సవాలను కూడా బీజేపీ రాజకీయం చేస్తోందని ఆయన ఆరోపించారు. 'నేను కూడా హిందువునే. మా ఊరిలో రాముడి గుడి నిర్మించాం. కానీ మానవత్వం అనేది చాలా ముఖ్యం' అని ఆయన పేర్కొన్నారు. దసరా వేడుకల విషయంలో బీజేపీ అబద్ధాలను ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ధర్మస్థల ఛలో' యాత్ర కేవలం రాజకీయ లబ్ధి కోసమేనని, దానివల్ల వారికి ఎలాంటి ప్రయోజనం ఉండదని సిద్ధరామయ్య అన్నారు. ఒకవైపు సిట్ విచారణను వ్యతిరేకించని బీజేపీ, ఇప్పుడు దాని వల్ల ఏమీ రాదని తెలిసి వ్యతిరేకించడం వారి ద్వంద్వ వైఖరికినిదర్శనమని ఆయన విమర్శించారు. దసరా ఒక మతానికి సంబంధించిన పండుగ కాదని, అది అందరూ కలిసి జరుపుకునే రాష్ట్ర పండుగ అని ఆయన వివరించారు. ఈ సందర్భంగా, తన స్వగ్రామంలో ఒక పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తూ తన చిన్ననాటి రోజులను గుర్తుచేసుకున్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in